



# జనపదం
J A N A P A D H A M

హైదరాబాద్ | బుధవారం 18 సెప్టెంబర్ 2024 | సంచిక: 1 సంపుటి: 100 తెలుగు దినపత్రిక


## బైబై గణేషా..

4

ఘనంగా నిమజ్జనోత్సవం.. కన్నులపండువగా శోభాయాత్ర

- కిక్కిరిసిన ట్యాంక్ బండ్, పరిసర ప్రాంతాలు
- క్రేన్ 4 దగ్గర ఖైరతాబాద్.. 13 దగ్గర బాలాపూర్ గణేశుడి నిమజ్జనం
- జీహెచ్ఎంసీ పరిధిలో 71 కృత్రిమ నీటి కొలనుల ఏర్పాటు
- కొనసాగుతోన్న నిమజ్జనాలు, పోలీసుల భారీ భద్రత
- బుధవారం ఉదయం వరకు నిమజ్జనం పూర్తి
- హుస్సేన్ సాగర్ వద్ద ఏర్పాట్లను పరిశీలించిన సీఎం రేవంత్

రికార్డ్ బ్రేక్ లడ్డూలు

# అంతు చూస్తా..

## హైడ్రా జోలికి వస్తే ఊరుకునేది లేదు..





- భూ మాఫియాను వదిలిపెట్టను
- హైదరాబాద్ భవిష్యత్తు కోసమే హైడ్రా
- సెప్టెంబర్ 17 ఇకపై ప్రజా పాలన దినోత్సవం
- గడిచిన పదేళ్లు తెలంగాణ నియంత పాలనలో మగ్గింది
- విధ్వంసమైన రాష్ట్రాన్ని మళ్లీ గాడిలో పెడుతున్నాం
- తెలంగాణ హక్కుల సాధన కోసమే ఢిల్లీ పర్యటనలు
- తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తిని తప్పుపట్టొద్దు..
- ప్రజాపాలన దినోత్సవ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి

**జనపదం, బ్యూరో**

"హైదరాబాద్ ను కాపాడుకోవడం కోసమే హైడ్రా. ఎవరి కోసమో దానిని తెచ్చింది లేదు. ప్రజల ఆస్తులను కాపాడడే ఎజెండా. దాని జోలికి ఎవరైనా వస్తే ఊరుకునే ప్రసక్తే లేదు.." అని సీఎం ఘాటుగా మాట్లాడారు. కొట్లాడి.. ప్రాణాలిచ్చి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం గడిచిన పదేళ్లు నియంత పాలనలో మగ్గిపోయిందని సీఎం రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్ల పాటు విధ్వంసమైన తెలంగాణను మళ్లీ గాడిలో పెడుతున్నామన్న ఆయన రైతులు, కార్మికుల సంక్షేమం దిశగానే పాలన ఉంటుందని స్పష్టం చేశారు. తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తిని ఎవ్వరూ తప్పుపట్టవద్దని హితవు పలికిన సీఎం రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రజలు చేసిన పోరాటాన్ని ఆయన గుర్తుచేశారు. తెలంగాణ అంటేనే త్యాగం, బలిదానమని అభివర్ణించారు. మంగళవారం రాష్ట్ర ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం తరపున పబ్లిక్ గార్డెన్స్ లో నిర్వహించిన వేడుకల్లో ......(తరువాయి 4లో)



## రేవంత్ శాపగ్రస్తుడు..

### తిట్టకపోతే బతకడు..

- కాంగ్రెస్ చేసిన అప్పులు బీఆర్ఎస్ ఖాతాలో..
- రాష్ట్ర ప్రతిష్టను దిగాజార్చుతున్నడు..
- అబద్దాల పునాదులపై కాంగ్రెస్ సర్కార్
- బీఆర్ఎస్ చేసింది రూ.4,26,499 కోట్లు మాత్రమే..
- రూ.6,71,757 కోట్లని తప్పుడు ప్రచారం..
- సీఎం పై మండిపడిన మాజీ మంత్రి హరీశ్ రావు

**జనపదం, మెదక్:**

ప్రతీరోజు లేవంగానే కేసీఆర్‌ను తిట్టకపోతే బతకలేడనే అనే శాపం ఉన్నట్టుందని, అబద్దాల పునాదులపై ఏర్పడిందే కాంగ్రెస్ సర్కారని.. రాష్ట్రం అప్పుల పాలైందని సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. 16వ ఆర్థిక సంఘం ముందు మళ్లీ అవే అబద్దాలను వల్లెవేయడం సిగ్గు చేటన్నారు. రాష్ట్ర ప్రతిష్టను, పరపతిని దిగజార్చేలా వ్యవహరించడం దుర్మార్గమని మండిపడ్డారు. మెదక్‌లో ఆయన మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ రాష్ట్రం దివాళా తీసిందని, ఆర్థిక సమస్యల్లో కొట్టుమిట్టాడుతున్నట్లు స్వయంగా సీఎం పదే పదే మాట్లాడటం రాష్ట్ర భవిష్యత్ ను......(తరువాయి 2లో)

## నైట్ షిఫ్ట్‌లు వద్దన లేం..



- మహిళలకు మినహాయింపు కాదు, అవకాశం ఇవ్వండి..
- ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ ఘటనపై సుమోటో కేసు విచారణ..
- మహిళా డాక్టర్ల విషయమై సుప్రీం కీలక వ్యాఖ్యలు..

2

## చరిత్రను తొక్కేసే యత్నం



- రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ పోరాట యోధులను మరిచింది
- ఆగస్టు 15 ఎంత ముఖ్యమో.. సెప్టెంబర్ 17 కూడా అంతే
- చరిత్రను పట్టించుకోని పార్టీలను తరిమికొడదాం
- పరేడ్ గ్రౌండ్స్‌లో తెలంగాణ విమోచన వేడుకలు
- జాతీయ జెండాను ఆవిష్కరించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి
- పాల్గొన్న కేంద్రమంత్రి బండి సంజయ్, ఎంపీలు ఈటల, లక్ష్మణ్ తదితరులు

2



## విగ్రహం తొలగిస్తాం..

- నిమజ్జనం సాక్షిగా ఆ పనిచేసి తీరుతాం..
- ఎవరూ ఆపలేరు... ఎవరొస్తారో చూస్తాం
- పాలనే లేనప్పుడు ప్రజాపాలనేంటో..?
- చరిత్ర తెలియని వాళ్లు తెలివి తక్కువ పని..
- రాజకీయాల కోసం వక్రీకరిస్తున్నారు
- 9 నెల్లన్నీ కేసీఆర్ తిట్టడానికే సరిపోయింది..
- రేవంత్ పై ధ్వజమెత్తిన కేటీఆర్

**జనపదం, హైదరాబాద్:**

సచివాలయం ముందు రాష్ట్ర ప్రభుత్వం నెలకొల్పిన రాజీవ్ గాంధీ విగ్రహాన్ని తప్పక తొలగిస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎవరూ తమను ఎవరూ ఆపలేరన్నారు. అడ్డుకునేందుకు ఎవరొస్తారో చూస్తామి కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు.తెలంగాణ తల్లి ఆత్మను అవమానించావు. తెలంగాణ తల్లి ఉండాల్సిన చోట రాజీవ్ గాంధీ విగ్రహం ఎలా పెడతారని ప్రశ్నించారు. మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే సకల మర్యాదలతో రాజీవ్ విగ్రహాన్ని గాంధీ భవన్ కు తరలిస్తామన్నారు. .....(తరువాయి 2లో)



## పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు..

- భూమిలేని పేదలకు ఏడాదికి 12 వేలు
- ప్రజాపాలన దినోత్సవాన్ని అంతా స్వాగతించాలి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క...
- సోలార్ పంపుసెట్ల పైలెట్ ప్రాజెక్టుగా సిరిపురం ఎంపిక
- దళిత బంధు లబ్ధిదారులకు మంజూరి పత్రాల అందజేత..

3



## రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా కుమిదిని

- విశ్రాంత ఐఏఎస్ ఎంజీ గోపాల్‌కు విజిలెన్స్ కమిషనర్ బాధ్యతలు..
- ఉత్తర్వులు జారీ చేసిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

3



## హస్తినా సీఎం అతిశీ..

- ఢిల్లీ ముఖ్యమంత్రిగా టీచరమ్మ..
- రాజీనామాచేసిన కేజ్రీవాల్..
- అతిశికి అవకాశం కల్పించిన పార్టీ శ్రేణులు...
- బుధవారం బాధ్యతల స్వీకరణ?..

2

# హస్తినా సీఎం అతిశి..

- ఢిల్లీ ముఖ్యమంత్రిగా టీచరమ్మ..
- రాజీనామా చేసిన కేజ్రీవాల్..
- అతిశికి అవకాశం కల్పించిన పార్టీ శ్రేణులు...



**జనపదం, ఢిల్లీ:** ఢిల్లీ కొత్త ముఖ్యమంత్రిగా ఆతిశీ సింగ్ ఎంపికయ్యారు. ఆతిశీ సింగ్ పేరును అరవింద్ కేజ్రీవాల్ ప్రతిపాదించారు. కేజ్రీవాల్ ప్రతిపాదనకు ఆప్ శాసనసభాపక్షం ఆమోదం తెలిపింది. కాగా, ప్రస్తుతం ఆతిశీ దిల్లీ విద్యాశాఖ మంత్రిగా ఉన్నారు. మంగళవారం ఉదయం 11.30 గంటలకు కేజ్రీవాల్ నివాసంలో జరిగిన పార్టీ శాసనసభాపక్ష సమావేశంలో ఆతిశీ పేరును సీఎంగా ఖరారు చేశారు. ఆతిశీ పేరును కేజ్రీవాల్ ప్రతిపాదించగా ఎమ్మెల్యేలు మద్దతు ప్రకటించారు. షీలా దీక్షిత్ తర్వాత దిల్లీలో మహిళా సీఎంగా ఆతిశీ బాధ్యతలు స్వీకరించనున్నారు. దిల్లీకి మూడో మహిళా ముఖ్యమంత్రిగా ఆతిశీ విధులు నిర్వర్తించనున్నారు.

## సీఎం పదవికి కేజ్రీవాల్ రాజీనామా

ఢిల్లీ ముఖ్యమంత్రి పదవికి అరవింద్ కేజ్రీవాల్ రాజీనామా చేశారు. మంగళవారం సాయంత్రం గవర్నర్ వీకే సక్సేనాను కలిసిన కేజ్రీవాల్ తన రాజీనామా లేఖను సమర్పించారు. కాగా, రెండు రోజుల క్రితమే సీఎం పోస్టుకు రాజీనామా చేస్తానని ప్రకటించిన కేజ్రీవాల్..తాజాగా నిర్ణయం తీసుకున్నారు.

## తీవ్ర ఆగ్రహంలో ప్రజలు : ఆతిశీ

ఢిల్లీ కొత్త సీఎంగా ఎంపికైన ఆతిశీ సింగ్ తొలిసారిగా మీడియాతో మాట్లాడారు. అరవింద్ కేజ్రీవాల్కు ధన్యవాదాలు తెలిపారు. ఆయన్ను మళ్లీ ముఖ్యమంత్రిగా తీసుకురావడానికి ప్రయత్నిస్తానని చెప్పారు. తన లాంటి ఫస్ట్టైమ్ పొలిటిషియన్కు ఇలాంటి బాధ్యతలు అప్పగించడం ఆమ్ ఆద్మీ పార్టీలోనే సాధ్యం అని అన్నారు. కేజ్రీవాల్ రాజీనామాపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని వ్యాఖ్యానించారు. "ముఖ్యమంత్రిగా నాతో పాటు దిల్లీ ప్రజలు, ఆప్ ఎమ్మెల్యేలు ఒకే లక్ష్యంతో ఎన్నికల వరకు పనిచేస్తాం. మేము దిల్లీ సీఎంగా అరవింద్ కేజ్రీవాల్ను మళ్లీ గెలిపించాలి. కేజ్రీవాల్ నన్ను నమ్మారు. ఎమ్మెల్యే, మంత్రి ఇప్పుడు ముఖ్యమంత్రిని చేశారు. నేను ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతున్నాను. ఫస్ట్టైమ్ పొలిటిషియన్స్ కేవలం ఆప్లో మాత్రమే ఇలాంటి అవకాశాలను పొందగలరు. నేను వేరే పార్టీలో ఉంటే ఇలా జరిగేది కాదు. నేను సంతోషంగా ఉన్నాను. మరో వైపు మా అన్నయ్య(కేజ్రీవాల్) రాజీనామా చేస్తుండటం వల్ల బాధగా ఉంది. ఇది, కేజ్రీవాల్ రాజీనామా చేసే బాధాకరమైన క్షణం కాబట్టి నాకు పూలమాలలు, అభినందనలు తెలపవద్దని విజ్ఞప్తి చేస్తున్నా. నేను ఈ బాధ్యత తీసుకున్నంత కాలం నా లక్ష్యం ఒక్కటే. దిల్లీ ప్రజలను రక్షించడానికి అరవింద్ కేజ్రీవాల్ మార్గదర్శకత్వంలో ప్రభుత్వాన్ని నడపడానికి ప్రయత్నిస్తాను." అని ఆతిశీ అన్నారు.

## ముందుగానే ప్రకటన

మద్యం విధానం కేసులో ఈడీ విచారణ ఎదుర్కొంటున్న కేజ్రీవాల్కు సుప్రీం కోర్టు గత శుక్రవారం బెయిల్ మంజూరు చేసింది. ఆదివారం పార్టీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించిన కేజ్రీవాల్ 2 రోజుల్లో సీఎం పదవికి రాజీనామా చేస్తానని సంచలన ప్రకటన చేశారు. న్యాయస్థానం నుంచి న్యాయం దక్కిందనీ, ప్రజల నుంచి న్యాయం జరగాల్సిన సమయం వచ్చిందని పేర్కొన్నారు. ప్రజలు తమను నిజాయతీ పరులుగా అంగీకరించేవరకు సీఎం సీటులో కూర్చోబోనని కేజ్రీవాల్ చెప్పారు. ఈ క్రమంలో తదుపరి సీఎం రేసులో పార్టీ కీలక నేతలు ఆతిశీ, సౌరభ్ భరద్వాజ్, రాఘవ్ చద్దా, కైలాశ్ గహ్లోత్తో పాటు కేజ్రీవాల్ సతీమణి సునితా కేజ్రీవాల్ పేర్లు వినిపించాయి. ఈ రెండు రోజులు పార్టీ ముఖ్యనేతలతో కేజ్రీవాల్ అనేక సమావేశాలు నిర్వహించారు. చివరికి ఆతిశీని ముఖ్యమంత్రిగా ఆప్ ఎంపిక చేసింది. మంగళవారం సాయంత్రం నాలుగున్నరకు లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాను కలిసి కేజ్రీవాల్ తన రాజీనామాను సమర్పించనున్నారు.

## ప్రమాణ స్వీకారం ఎప్పుడు..?

సెప్టెంబరు 26, –27 తేదీల్లో ఢిల్లీ అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు జరగనున్నాయి. ఆ సమయంలోనే ఆతిశీ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నట్లు ఆప్ వర్గాలు వెల్లడించాయి. ఈసారి డిప్యూటీ సీఎంగా ఎవరినీ ప్రకటించే అవకాశాలు లేవని తెలుస్తోంది.

## కేజ్రీవాల్ కు ధన్యవాదాలు..

ఢిల్లీ బాధ్యతను అప్పగించిన కేజ్రీవాల్ కు ధన్యవాదాలు చెప్పిన అతిషి..కేజ్రీవాల్ రాజీనామాతో తాను వ్యక్తిగతంగా బాధపడ్డానని తెలిపారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు అయ్యేవరకు మాత్రమే తాను సీఎంగా ఉంటానని..మళ్లీ ఆప్ గెలిస్తే కేజ్రీవాల్ సీఎం బాధ్యతలు చేపడతారని అతిషి స్పష్టం చేశారు. కేజ్రీవాల్ నాయకత్వంలోనే తామంతా పనిచేస్తామని తెలిపారు. తాను ఆప్ కాకుండా వేరొక పార్టీలో ఉండి ఉంటే ఎన్నికల్లో పోటీ చేయడానికి కూడా తనకు టిక్కెట్ ఇచ్చేవారు కాదని..కేజ్రీవాల్ వల్లనే తాను ఈ స్థాయిలో ఉన్నానని ఆమె తెలిపారు. కాగా, అతిశీ పూర్తి పేరు.. అతిశీ మర్లేనా సింగ్. ఆమె వయస్సు 43 ఏళ్లు. ఢిల్లీ యూనివర్సిటీలోని సెయింట్ స్టీఫెన్స్ కాలేజీ నుంచి డిగ్రీ పొందిన అతిషి ఆ తర్వా ఆక్స్ఫర్డ్ యూనివర్సిటీ నుంచి మాస్టర్స్ డిగ్రీ పొందారు. తొలుత ఢిల్లీ ప్రభుత్వ విద్యాశాఖ సలహాదారుగా ఎదిగిన ఆమె 2020 ఎన్నికల్లో విజయం సాధించి తొలిసారి ఎమ్మెల్యే అయ్యారు. మనీష్ సిసోడియా, సత్యేంద్ర జైన్ రాజీనామా చేసిన తర్వాత 2023 మార్చిలో అతిషి కేబినెట్ మంత్రి అయ్యారు. ప్రస్తుత ప్రభుత్వంలో అతిషి మొత్తం 14 మంత్రిత్వ శాఖలను నిర్వహిస్తున్నారు. ఇన్ని శాఖల బాధ్యత కలిగిన ఏకైక మంత్రి అతిషి కావడం విశేషం. ఆతిశీ మార్లీనా సింగ్, 1981 జూన్ 8న జన్మించారు. ఆతిశీ తల్లిదండ్రులు విజయ్ సింగ్, త్రిప్తా వాహి దిల్లీ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్లు. మార్క్స్, లెనిన్ కలయికతో ఆమెకు ఆతిశీ మార్లీనా అని పేరు పెట్టారు. ఆతిశీ కొంతకాలం ఆంధ్రప్రదేశ్లోని రిశి వ్యాలీ స్కూల్లో చరిత్ర, ఇంగ్లీష్ టీచర్ గా పనిచేశారు.

### ఫస్ట్ టైం ఎమ్మెల్యే.. వెంటనే సీఎం..

ప్రస్తుతం కేజ్రీవాల్ కేబినెట్ లో విద్యాశాఖ,పర్యాటక శాఖ సహా మొత్తం 5 శాఖల మంత్రిగా ఉన్న అతిషినే ఢిల్లీ కొత్త సీఎంగా ఎంపిక చేసింది ఆమ్ ఆద్మీ పార్టీ. ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో బెయిల్ పై తీహార్ జైలు నుంచి కేజ్రీవాల్ విడుదలవడం..ఆ తర్వాత ఆయన రాజీనామా చేస్తానని ప్రకటించడం.. ఇప్పుడు ఢిల్లీకి కొత్త సీఎం ఎంపిక అన్నీ చకచకా జరిగిపోయాయి. ప్రస్తుతం కేజ్రీవాల్ కేబినెట్ లో విద్యాశాఖ,పర్యాటక శాఖ సహా మరికొన్ని కీలక శాఖల మంత్రిగా ఉన్న అతిషినే ఢిల్లీ కొత్త సీఎంగా ఎంపిక చేసింది. తొలిసారి ఎమ్మెల్యే అయిన ఆమెను సీఎం పదవి వరించింది. అరవింద్ కేజ్రీవాల్కు ఉన్న నమ్మకం, సాన్నిహిత్యం కాకుండా, బ్యూరోక్రసీతో మంచి సంబంధాలు, అనేక ఇతర అంశాలు అతిషిని కలిసి వచ్చిన అంశాలు. ముఖ్యంగా ఆప్ నేతలలో చాలామంది ముఖ్యులకు బ్యూరోక్రసీతో సమస్య ఉండేది..కానీ అతిషికి మాత్రం వారికి మంచి రిలేషన్ ఉండేది. ఇది ఆమెకు అతిపెద్ద అడ్వాంటేజ్ అని చెప్పవచ్చు. అంతేకాకుండా వచ్చే ఎన్నికల్లో మళ్లీ ఆప్ గెలిస్తే పవర్ ఎక్సేంజ్ విషయంలో అతిషి ఎలాంటి ఇబ్బందులు రావని గ్రహించే కేజ్రీవాల్ ఆమెను ఎంపిక చేసుకున్నట్లు అర్థమవుతోంది.

# ఊళ్లకు ఫైబర్ నెట్వర్క్..

- 20 ఎంబీ ఇంటర్నెట్ కనెక్టివిటీ..
- పైలెట్ ప్రాజెక్ట్ గా సంగుపేట, మద్దూరు, అడవి శ్రీరాంపూర్
- వెల్లడించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**జనపదం, కరీంనగర్:** కేంద్ర ప్రభుత్వ సహకారంతో త్వరలోనే తెలంగాణలోని అన్ని గ్రామాలకు ఫైబర్ నెట్వర్క్ అందుబాటులోకి తీసుకొచ్చి ఇంటర్నెట్ కనెక్షన్ల సదుపాయం కల్పించనున్నట్టు ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కీలక ప్రకటన చేశారు. మంగళవారం కరీంనగర్లో ప్రజాపాలన దినోత్సవంలో పాల్గొన్న అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలోని అన్ని గ్రామాలకు ఫైబర్ నెట్వర్క్ని విస్తరించి 20 ఎంబీ ఇంటర్నెట్ కనెక్టివిటీ సదుపాయాన్ని అందించేందుకు ఐటీ శాఖ కృషి చేస్తోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన సూచన మేరకు తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా సంగుపేట, నారాయణపేట జిల్లా మద్దూరు, పెద్దపల్లి జిల్లా అడవి శ్రీరాంపూర్ గ్రామాలను పైలెట్ ప్రాజెక్టులుగా ఎంచుకున్నట్టు తెలిపారు. త్వరలోనే.. ఈ గ్రామాల్లో పూర్తి స్థాయిలో నెట్వర్క్ విస్తరించనున్నట్టు తెలిపారు. ఈ పైలెట్ గ్రామాల్లో ప్రధానంగా కేబుల్ టీవీ సర్వీస్, కేబుల్ వర్చువల్ డెస్క్టాప్ కనెక్టివిటీతో పాటు.. 20 ఎంబీ అన్లిమిటెట్ ఇంటర్నెట్ కనెక్టివిటీ, టెలిఫోన్ సౌకర్యం కల్పిస్తున్నామని మంత్రి శ్రీధర్ బాబు చెప్పుకొచ్చారు. అలాగే ఈ మూడు గ్రామాల్లో రాష్ట్ర సర్కార్ అదనంగా.. 360 డిగ్రీస్లో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ను ఉపయోగించి సీసీ కెమెరాలు కూడా అమర్చుతున్నామని తెలిపారు. 2 నెలల్లో పైలెట్ ప్రాజెక్టు పూర్తి చేసి.. అక్కడ ఎదురయ్యే సాంకేతికపరమైన లోపాలను గుర్తించి.. ఇంకా ఎలాంటి సదుపాయాలు కల్పిస్తే బాగుంటుందా అన్న విషయాలను పరిశీలిస్తామని మంత్రి తెలిపారు. ఇప్పటికే.. ఫైబర్ నెట్ ద్వారా తెలంగాణలోని 8000 గ్రామాలకు నెట్వర్క్ అందించామని మంత్రి శ్రీధర్బాబు చెప్పుకొచ్చారు. మరో 3000 గ్రామాలకు నెట్వర్క్ చేయాల్సి ఉందని చెప్పారు.

# నైట్ షిఫ్ట్కు మహిళలను వద్దనలేం..

## బెంగాల్ సర్కార్ తీరును తప్పుపట్టిన సుప్రీంకోర్టు

**జనపదం, న్యూఢిల్లీ:** నైట్ షిఫ్ట్లో పనిచేసే మహిళలను అడ్డుకోలేమని సుప్రీంకోర్టు పేర్కొంది. రాత్రి పూట పని చేయకూడదని వాళ్లకు చెప్పలేమని స్పష్టం చేసింది. నైట్ షిఫ్ట్ల నుంచి మహిళా డాక్టర్లకు విముక్తి కల్పిస్తూ బెంగాల్ సర్కారు తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీంకోర్టు తప్పుపట్టింది. మహిళలకు మినహాయింపులు అవసరం లేదని, వాళ్లకు కేవలం సమాన అవకాశాలు కావాలని ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ ఘటనపై నమోదైన సుమోటో కేసు విచారణ సమయంలో కోర్టు పేర్కొంది. సీజేఐ చంద్రచూడ్ నేతృత్వంలోని బెంచ్ ఈ కేసులో తీర్పునిచ్చింది. జస్టిస్ జేబీ పర్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. మహిళ భద్రత దృష్ట్యా.. మహిళా డాక్టర్లు రాత్రిపూట పనిచేయవద్దు అని కోర్టులో కేసు దాఖలైంది. 'రాత్రిపూట పని చేయవద్దని మహిళలకు ఎలా చెబుతాం, వాళ్లకు మినహాయింపులు కాదు, సమాన అవకాశాలు కావాలి, అన్ని పరిస్థితుల్లోనూ పని చేసేందుకు మహిళా డాక్టర్లు ఆసక్తిగా ఉన్నారు. వాళ్లు కచ్చితంగా అన్ని పరిస్థితుల్లో పనిచేయాలి, బెంగాల్ సర్కారు తమ నిర్ణయాన్ని సరి చేసుకోవాలి, 12 గంటల షిఫ్ట్ను దాటేసి మహిళలు పనిచేయరాదు అని చెప్పలేం' అని కోర్టు అభిప్రాయపడింది. సైనిక దళాల్లో రాత్రి పూట పనిచేసే మహిళలు ఉన్నారని ధర్మాసనం తెలిపింది. ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వం మహిళా డాక్టర్లకు రక్షణ ఇచ్చేందుకు వెనుకాడితే, అప్పుడు కేంద్ర ప్రభుత్వం వాళ్లకు రక్షణ ఇస్తుందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తెలిపారు. నైట్ షిఫ్ట్ విషయంలో సవరణ చేస్తూ కొత్త నోటిఫికేషన్ జారీ చేస్తామని బెంగాల్ సర్కారు తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ తెలిపారు.

# విగ్రహం తొలగిస్తాం..



(మొదటిపేజీ తరువాయి) రేవంత్ కు అంత ఇష్టమైతే జూబ్లీహిల్స్ లో ఆయన ఇంట్లో పెట్టుకోవచ్చునని అన్నారు. గణేష్ నిమజ్జనం రోజు చెబుతున్నా రాసి పెట్టుకో.... కచ్చితంగా రాజీవ్ గాంధీ విగ్రహాన్ని తొలగిస్తామన్నారు. ఇది కచ్చితంగా జరిగి తీరుతుందన్నారు మంగళవారం తెలంగాణ భవన్ లో సెప్టెంబర్ 17ను జాతీయ సమైక్యతా దినోత్సవం పేరిట ఘనంగా సంబరాలు నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన జాతీయ జెండా ఎగురవేశారు. అనంతరం పార్టీ కార్యాలయ ఆవరణలో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి పా లాభిషేకం చేశారు. తదనంతరం మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో పాలనే లేదు.. సెప్టెంబర్ 17 ప్రజాపాలన జరపడం ఎందుకని ప్రశ్నించారు. చరిత్ర తెలియని కొంతమంది సెప్టెంబర్ 17 ను రాజకీయాల కోసం వక్రీకరిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో గంగా, జమున తెహజీబ్ ఉండాలనే ఉద్దేశంతో కేసీఆర్ గత పదేళ్లలో ఒక్క నొక్కు పడకుండా శాంతి భద్రతలను కాపాడారన్నారు. కానీ రేవంత్ సర్కార్ అధికారంలోకి వచ్చిన తరువాత హైదరాబాద్ ఇమేజ్ మసకబారుతోందన్నారు. ఆయన మాట్లాడుతున్న పనికి మాలిన మాటలను తెలంగాణ సమాజం అసహ్యించుకుంటోందన్నా రు. నోరు ఉంది కదా అని కేసీఆర్ ను దూషించటమే పనిగా పెట్టుకొని 9 నెలలు టైమ్ పాస్ చేశారని విమర్శించారు. చేతనైతే కాంగ్రెస్ ఇచ్చిన 420 అడ్డగోలు హామీలను అమలు చేసి చూపెట్టాలని మరోసారి రేవంత్ కు కేటీఆర్ సవాల్ విసిరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగా కరెంట్, రైతుబంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కంప్యూటర్ ను ఈ దేశానికి పరిచయం చేసింది రాజీవ్ గాంధీని రేవంత్ చెప్పడం ఆయన అజ్ఞానికి నిదర్శనమన్నారు. 1955 లో టాటా గ్రూప్ వాళ్లు కంప్యూటర్ పరిచయం చేశారన్నారు.. ఇక రాష్ట్రంలో పారిశుధ్యం పడకేసింది. చికెన్ గున్యాలు, విష జ్వరాలు, డెంగీలతో జనం బాధపడుతున్నారన్నారు. పట్టణ ప్రగతి, పల్లె ప్రగతిని పక్కన పెట్టారన్నారు. కనీసం పల్లెల్లో పీచికారి కి కూడా పైసల్లేవన్నారు. దీంతో రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీ విధించే పరిస్థితి వచ్చిందన్నారు. గురుకులాల్లో పిల్లల మీద ఆఘాయిత్యాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఇలా రాష్ట్రంలో ఆలనా పాలన లేని పరిస్థితి ఉంటే...రేవంత్ రెడ్డి డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు.

# చరిత్రను తొక్కిపెట్టే ప్రయత్నం

- రాష్ట్ర ప్రభుత్వం పోరాట యోధులను మరిచింది
- ఆగస్టు 15 ఎంత ముఖ్యమో.. సెప్టెంబర్ 17 కూడా అంతే
- చరిత్రను పట్టించుకోని పార్టీలను తరిమికొడదాం
- పరేడ్ గ్రౌండ్స్ లో తెలంగాణ విమోచన వేడుకలు
- జాతీయ జెండాను ఆవిష్కరించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి
- పాల్గొన్న కేంద్రమంత్రి బండి సంజయ్, ఎంపీలు ఈటల, లక్ష్మణ్ తదితరులు



**జనపదం, హైదరాబాద్ సిటీ:** తెలంగాణ విమోచన పోరాట చరిత్రను పాలకులు తొక్కిపెట్టే ప్రయత్నం చేస్తున్నారని కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ధ్వజమెత్తారు. నిజాం నుంచి తెలంగాణకు విముక్తి లభించిన రోజు, తెలంగాణ పోరాట యోధులను రాష్ట్ర ప్రభుత్వం మర్చిపోయిందన్నారు. ఆగస్టు 15 ఎంత ముఖ్యమో, సెప్టెంబర్ 17 కూడా అంతే ముఖ్యమని అన్నారు. చరిత్రను పట్టించుకోని పార్టీలను తరమికొడదామని పిలుపునిచ్చారు. మంగళవారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ లో కేంద్ర సాంస్కృతి శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్స వేడుకలు జరిగాయి. వేడుకల్లో ముఖ్య అతిథులుగా కిషన్ రెడ్డి, కేంద్రమంత్రి బండి సంజయ్, అతిథులుగా బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్, డాక్టర్ కె.లక్ష్మణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించి, గౌరవ వందనం స్వీకరించారు. అమరవీరుల స్తూపానికి నివాళి అర్పించారు. అనంతరం కిషన్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ చరిత్ర ఎన్నో విషాద గాథల ను లిఖించిందన్నారు. నిజాం పాలనలో రజాకార్ల ఆగడాలతో ఇక్కడి ప్రజలు ప్రత్యక్ష నరకం అనుభవించారన్నారు. కత్తులు, రోకళ్లు, గొడ్డళ్లతో ప్రజలు నిజాంపై పోరాటం చేశారన్నారు. ఆనాటి పాలనలో దేశ్ ముఖ్ లు, దొరలు, జాగీర్దార్లు కలిసి అమాయకప్రజలను చెరబడ్డారని అన్నారు. బలవంతపు మతమార్పిడిలకు పాల్పడ్డారని తెలిపారు. అణచివేతకు గురైన వేలాది మంది ప్రజలు వీరోచిత పోరాటం ఫలితంగా నిజాం పాలన నుంచి తెలంగాణకు విమోచనం కలిగిందని కిషన్ రెడ్డి చెప్పారు.

## పాలకుల మోసం..

తెలంగాణ గడ్డకు స్వాతంత్ర్యం వచ్చిన రోజును జరపకుండా పాలకులు మోసం చేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. నిజాం , రజాకార్ల మెడలు వంచి తెలంగాణ సాధించడంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ పాత్ర సాహసోపేతమైనదని కిషన్ రెడ్డి కొనియాడారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సీఎం అయిన తర్వాత విమోచన వేడుకలను అధికారికంగా నిర్వహిస్తామని ఇచ్చిన మాటను తప్పారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ కూడా మోసం చేసిందన్నారు. కాంగ్రె స్, బీఆర్ఎస్ పార్టీలు రజాకార్ల వారసత్వమైన మజ్లిస్ పార్టీకి కొమ్ముకాస్తున్నాయని ఆరోపించారు. మూడేళ్ళుగా పరేడ్ గ్రౌండ్స్ లో కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న తెలంగాణ విమోచన వేడుకలకు ప్రజలు స్వచ్ఛందంగా రావడం గమనార్హమన్నారు. సెప్టెంబర్ 17న విమోచన దినోత్సవం అధికారికంగా నిర్వహించాలని 1998 నుంచి బీజేపీ ఆధ్వ ర్యంలో ఎన్నో పోరాటాలు చేశామని ఆయన గుర్తు చేశారు. విమోచన వేడుకలను కేంద్రమే అధికారికం గా నిర్వహిస్తుండడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం కూడా తూతూ మంత్రం గా ప్రజలను తప్పుదోవ పట్టించేవిధంగా గత బీఆ ర్ఎస్ ప్రభుత్వం 'జాతీయ సమైక్యత దినం' పేరిట, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 'ప్రజా పాలన దినోత్సవం' అంటూ సన్నా యి నొక్కులు నొక్కుతోందని కిషన్ రెడ్డి విమర్శించారు.

## ప్రజలకు చరిత్ర తెలియాలి..

నేటికి కూడా తెలంగాణ స్వాతంత్ర్య చరిత్రను ప్రజలకు తెలియకుండా తప్పుదోవ పట్టించేలా ఇక్కడి ప్రభుత్వాలు, పార్టీలు స్వార్థపూరితంగా వ్యవహరిస్తున్నాయని ఆయన ఆరోపించారు. సెప్టెంబర్ 17ను బీఆర్ఎస్ 'జాతీయ సమైక్య దినం' అనడం, కాంగ్రెస్ 'ప్రజా పాలన దినోత్సవం' అనడం ముమ్మాటికి ఇక్కడి చరిత్రను తొక్కిపెట్టడమే అవుతుందన్నారు. నిజాం నియంతృత్వం నుంచి హైదరాబాద్ విముక్తి పొందిన రోజు 'జాతీయ సమైక్యతా దినం' ఎలా అవుతుందని ఆయన ప్రశ్నించారు. విమోచనకు, సమైక్యతకు సంబంధమేంటి? విమోచనకు, ప్రజా పాలనకు ఏం సంబంధం? ఇది ముమ్మాటికి తెలంగాణ చరిత్ర నేటి తరానికి తెలియకుండా చేస్తున్న కుట్ర అని ఆయన మండిపడ్డారు. స్వాతంత్ర్య ఉద్యమకారులు, అమరవీరుల త్యాగాలను, బలిదానాలను అవమానించడం రాజకీయ దివాళాకోరుతనం, ఓటుబ్యాంకు రాజకీయాలకు, కుహనాలౌకిక వాదానికి పరాకాష్ట అని ఆయన అన్నారు. విమోచనకు వక్రభాష్యాలు చెప్తోన్న బీఆర్ఎస్, కాంగ్రెస్ కు ప్రజలే బుద్ధి చెప్తారన్నారు. ఓటుబ్యాంకు రాజకీయాల కోసం, సంతుష్టీకరణ కోసం చరిత్రను తప్పుదోవ పట్టిస్తే భవిష్యత్ తరాలు క్షమించవని కిషన్ రెడ్డి అన్నారు. వీళ్లు ఏం పేరు పెట్టుకున్నా ప్రజలు మాత్రం 'విమోచన ఉత్సవాలు'గానే జరుపుకొంటారని ఆయన ఉద్ఘాటించారు.

# జూనియర్ డాక్టర్ హత్య కేసుపై విచారణ

- లైవ్ వద్దని కోరిన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్
- ఆపబోమని స్పష్టం చేసిన సుప్రీంకోర్టు..



**జనపదం, ఢిల్లీ:** కోల్కతా జూనియర్ డాక్టర్ అత్యాచారం, హత్య కేసుపై సుప్రీంకోర్టులో మంగళవారం విచారణ జరిగింది. ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్ ట్రైనీ డాక్టర్ కేసును కోర్టు సుమోటోగా తీసుకొని విచారణ జరుపుతున్న విషయం తెలిసిందే. సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం కేసును విచారణ జరిపింది. ఇంతకు ముందు జూనియర్ డాక్టర్ ఘటనపై నిరసన తెలుపుతున్న వైద్యులను విధుల్లో చేరాలని ఇంతకు ముందు సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించిన విషయం తెలిసిందే. మంగళవారం విచారణ సందర్భంగా సీబీఐని కోర్టు ప్రస్తుత స్టేటస్ రిపోర్ట్ ఇవ్వాలని కోరింది. అలాగే, హాస్పిటల్ ఆర్థిక అవకతవకలపై దర్యాప్తుకు సంబంధించి రిపోర్ట్ను సమర్పించాలని సీబీఐకి చెప్పింది. ఈ సందర్భంగా కేసు విచారణ ప్రత్యక్ష ప్రసారం అంశంపై బెంగాల్ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. కేసు విచారణ ప్రత్యక్ష ప్రసారాన్ని నిలిపివేయాలని కోరారు. ఇలాంటి కేసులను ప్రత్యక్ష ప్రసారం చేసినప్పుడు అది ప్రభావాన్ని చూపుతుందన్నారు. తాము నిందితులకు ప్రాతినిధ్యం వహించడం లేదని.. 50 సంవత్సరాల రెప్యుటేషన్ ఉందన్నారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ.. ఇది ఓపెన్ కోర్టు అని.. ఇది ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశమని తెలిపింది. కపిల్ సిబల్ స్పందిస్తూ ఇది తమ ప్రతిష్టకు సంబంధించిందన్నారు. ఛాంబర్లోని మహిళా న్యాయవాదులకు యాసిడ్ దాడి, అత్యాచారం చేస్తామని బెదిరింపులు వస్తున్నాయన్నారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తున్న న్యాయవాదులకు సోషల్ మీడియాలో బెదిరింపులు వస్తున్నాయని సిబల్ ప్రస్తావించారు. ధర్మాసనం స్పందిస్తూ.. ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశం కాబట్టి విచారణ ప్రత్యక్ష ప్రసారాన్ని ఆపబోమని స్పష్టం చేసింది. లాయర్లు, ఇతరులకు ఏదైనా ముప్పు వాటిల్లితే చర్యలు తీసుకుంటామని సిబల్కు కోర్టు భరోసా ఇచ్చింది.

# అప్పుల్లో ఉన్నాం.. వడ్డీ తగ్గించండి

**కుదిరితే పూర్తిగా లేదంటే పాక్షికంగానైనా తగ్గించండి**

**అందుకు కేంద్ర ప్రభుత్వ రంగ ద్రవ్య సంస్థలను ఒప్పించండి**

**నీటి పారుదల ప్రాజెక్టులకు నిధులు, క్లియరెన్సు ఇవ్వండి**

**ఢిల్లీలో 8వ ఇంటర్నేషనల్ వాటర్ వీక్ సదస్సులో మంత్రి ఉత్తమ్**




**జనపదం, ఢిల్లీ:** రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల కోసం గత ప్రభుత్వం చేసిన అప్పులు ఇప్పుడు ప్రభుత్వానికి ఆర్థికంగా భారంగా మారినందున వాటిపై విధించిన వడ్డీని పూర్తిగా లేదా పాక్షికంగా తగ్గించేలా కేంద్ర ప్రభుత్వ రంగ ద్రవ్య సంస్థలను ఒప్పించేలా చొరవ తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. వీలైతే మొత్తంగా క్లియర్ చేయాలని, లేదా పాక్షికంగానైనా మాఫీ చేయాలని కోరినట్లు తెలిపారు. మంగళవారం న్యూ ఢిల్లీలోని భారత మండపంలో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న 8వ ఇంటర్నేషనల్ వాటర్ వీక్ సదస్సు– 2024లో పాల్గొన్న ఆయన తెలంగాణలో ఈ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను వివరించారు. ఏటా సుమారు ఆరు లక్షల ఎకరాల మేర కొత్త ఆయకట్టును సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈసారి బడ్జెట్లో రూ. 29 వేల కోట్లను ఈ రంగానికి కేటాయించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ కృషికి తోడుగా కేంద్రం నుంచి తగిన సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఇది వరకే దేశంలో ఇన్ఫ్రాస్ట్రక్చర్ ను పెంపొందించడం కోసం రూ. లక్షల కోట్లు కేటాయిస్తామని పార్లమెంటులో ప్రకటించినట్లు.. నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణం కోసం అదే స్థాయిలో కేటాయింపులు చేయాలని కోరారు. ఈ ప్రాజెక్టులకు కేంద్రం నుంచి నిధుల రూపంలో సాయం అందడంతో పాటు వివిధ రకాల క్లియరెన్సులను కూడా త్వరితగతిన ఇచ్చేలా చొరవ తీసుకోవాలన్నారు. అలాగే పలు సాగునీటి ప్రాజెక్టులకు ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు తరపున సాఫ్ట్ లోన్ కావాల్సిందిగా ఆ రెండు సంస్థల ప్రతినిధులతో చర్చించామన్న ఆయన రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన సమ్మక్క–సారలమ్మ ఇరిగేషన్ ప్రాజెక్టులోని కొంత ముంపు భాగం చత్తీస్ఘడ్ రాష్ట్ర పరిధిలో ఉన్నందున దీన్ని పూర్తి చేయడానికి, కేంద్రం నుంచి క్లియరెన్సులు రావడానికి ఆ రాష్ట్రం నుంచి ఎన్ ఓ సీ రావాల్సి ఉన్నదని, ఆ ప్రక్రియను వేగవంతం చేయాల్సిందిగా ఆ రాష్ట్ర ఇరిగేషన్ మంత్రి కేదార్ కశ్యప్తో చర్చలు జరిపానన్నారు. చత్తీస్గడ్ ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి సమ్మక్క–సారలమ్మ ప్రాజెక్టుకు అన్ని రకాల క్లియరెన్సులు ఇచ్చేలా కేంద్ర ప్రభుత్వమూ చొరవ తీసుకోవాలని మంత్రి కోరారు. కేంద్ర జలశక్తి మంత్రి పాటిల్తో ఈ విషయంతో పాటు రాష్ట్ర ఇరిగేషన్ ప్రాజెక్టులకు సంబంధించి గత అప్పులపై వడ్డీని పూర్తిగా మాఫీ చేయడం లేదా తగ్గించాలని, చత్తీస్గడ్ నుంచి ఎన్ ఓ సీ లభించేందుకు కేంద్రం చొరవ తీసుకోవాలని ఉత్తమ్ విజ్ఞప్తి చేశారు.

# రేవంత్ శాపగ్రస్తుడు..



(మొదటిపేజీ తరువాయి) ప్రశ్నార్థకం చేయడమేనన్నారు. రూ.6.85 లక్షల కోట్ల అప్పుందనే తప్పుడు ప్రచారాన్ని ఇంకెన్నిసార్లు, ఇంకెన్ని రోజులు చేస్తారు రేవంత్ రెడ్డి..? అంటూ నిలదీశారు. పబ్లిక్ మీటింగ్లు, ప్రచార సభల్లో.. 16వ ఆర్థిక సంఘం ముందు, చివరికి ప్రజాపాలన దినోత్సవం వేదికగా కూడా అదే తొండి వాదన వినిపించడంతో రాష్ట్రానికి వచ్చే ప్రయోజనం ఏముంది? అని నిలదీశారు. గత అసెంబ్లీ సమావేశాల్లోనే రాష్ట్ర అప్పుల విషయంలో మీరు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొడుతూ వాస్తవాలు వెల్లడించానని గుర్తు చేశారు. తొమ్మిదిన్నరేళ్ల బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి, మూలధన పెట్టుబడి, సంక్షేమాల కొరకు నెట్గా చేసిన అప్పు రూ.4,26,499 కోట్లు మాత్రమే అని అసెంబ్లీ వేదికగా ఆన్ రికార్డ్ వివరించానన్నారు. తెచ్చిన అప్పులను మూలధనంగా మార్చి, ఎన్ని ఆస్తులు సృష్టించామో, ఎంత సంపద సృష్టించామో లెక్కలతో సహా చెప్పానని తెలిపారు. అయినా.. రూ.6.85 లక్షల కోట్ల అప్పు అంటూ, దివాళా తీసింది అంటూ రాష్ట్రానికి శాపం పెట్టడం ఎంత వరకు సమంజసం. దివ్యంగా ఉన్న రాష్ట్రాన్ని దివాళా తీసిందని ప్రచారం చేయడం ముఖ్యమంత్రిగా మీకు తగునా? ఇది పాపం కాదా?అని ప్రశ్నించారు.

## చేసిన అభివృద్ధి గురించి చెప్పరా..?

కేవలం అప్పుల గురించి మాట్లాడున్నారని.. కానీ 9ఏండ్ల కాలంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే తలసరి ఆదాయంలో అగ్రస్థానంలో నిలిచిన విషయాన్ని ఎందుకు చెప్పరు నిలదీశారు. ప్రతి ఇంటికి మిషన్ భగీరథ ద్వారా మంచినీళ్లు అందించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్న విషయాన్ని ఎందుకు చెప్పరు. తలసరి విద్యుత్ వినియోగంలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో ఉన్న విషయాన్ని ఎందుకు చెప్పరు? అప్పులను మూలధనంగా మార్చి తెలంగాణకు తరగని ఆస్తిని సృష్టించామన్న విషయాన్ని ఎందుకు చెప్పరు? ప్రశ్నించారు. రాష్ట్రం దివాళా తీసిందన్న మీ మాటలు విని పెట్టుబడులు పెట్టడానికి ఎవరైనా వస్తారా? రాజకీయ కక్షల కోసం రాష్ట్ర భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తారా? భావి తరాలకు శిక్ష వేస్తారా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## బోగస్ పెట్టుబడులు పెట్టినంత ఈజీ కాదు

విదేశాలకు వెళ్లి ఇక్కడి డొల్ల కంపెనీల్లో బోగస్ పెట్టుబడులు పెట్టినంత సులువు కాదు రాష్ట్ర ప్రతిష్టను కాపాడటం అన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై మీ బాధ్యత లేని వ్యాఖ్యలతో ఇప్పటికే పలు కంపెనీలు ఇతర రాష్ట్రాలకు తరలివెళ్లాయని.. మీ అనాలోచిత చర్యలతో రియల్ ఎస్టేట్ కుదేలైందని.. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్లో ఎప్పుడూ అగ్రస్థానంలో ఉండే తెలంగాణ, మీ పాలనలో టాప్ పది స్థానంలో కూడా స్థానం దక్కించుకోలేక పోయిందన్నారు. దీనికి మీ దివాళాకోరు వ్యాఖ్యలు, చేతగాని తనం కారణం కాదా? అంటూ నిలదీశారు. రాజకీయ కక్ష సాధింపు కోసం రాష్ట్ర ప్రయోజనాలను సైతం పణంగా పెట్టే గొప్ప ముఖ్యమంత్రిగా చరిత్రలో నిలిచిపోతారన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధిలో నడపడమంటే చిల్లర మల్లర వ్యాఖ్యలు చేయడం, ప్రతిపక్షాల మీద నోరు పారేసుకోవడం కాదన్నారు. ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అని.. రాష్ట్ర ప్రతిష్టను, గౌరవాన్ని మరింత పెంచే విధంగా వ్యవహరించండి అంటూ హితవు పలికారు. ఇది మీకే కాదు, రాష్ట్ర భవిష్యత్తుకు కూడా మంచిదన్నారు. రాష్ట్ర అప్పులపై మీకు అవగాహన కల్పించేందుకు మరోసారి వాస్తవాలను మీకు పంపిస్తున్నానని.. చదువుకొని, అధికారులతో సమీక్షించుకోవాలని కోరారు. దయచేసి తెలంగాణను అప్పుల రాష్ట్రంగా చిత్రీకరించవద్దని, ప్రతిష్ఠ దిగజార్చవద్దని తెలంగాణ ప్రజల పక్షాన కోరుతున్నానన్నారు.

## కాంగ్రెస్ అప్పు.. బీఆర్ఎస్ ఖాతాలో..

కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న అప్పును తెలివిగా బీఆర్ఎస్ ప్రభుత్వ ఖాతాలో వేశారని రేవంత్రెడ్డి సర్కారుపై మాజీ మంత్రి హరీశ్రావు మండిపడ్డారు. మెదక్లో ఆయన మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయిందంటూ సీఎం రేవంత్, కాంగ్రెస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని ఆయన ఖండించారు. ఈ సందర్భంగా తెలంగాణ అప్పులు– వాస్తవాలను మరోసారి ప్రభుత్వం తీసుకు వెళ్లారు. ఈ సందర్భంగా హరీశ్రావు మాట్లాడుతూ.. డిసెంబర్ 23న విడుదల చేసిన శ్వేతపత్రంలో నాలుగు రకాల అప్పులు చూపించారని.. రెండు రకాల అప్పులు ప్రభుత్వం చెల్లించాల్సిన అవసరం లేదని, శ్వేత పత్రలో క్లియర్గా మెన్షన్ చేశారన్నారు. మీరు ఇచ్చిన శ్వేతపత్రంలోనే గవర్నమెంట్ హామీలేనివి, గవర్నమెంట్ కట్టనివి రూ.59,414 కోట్లు అని చెప్పారని గుర్తు చేశారు. గవర్నమెంట్ హామీ ఉండి, గవర్నమెంట్ కట్టాల్సిన అవసరం లేనివి రూ.95,462కోట్లు అని చెప్పారని.. అంటే ప్రభుత్వం కట్టాల్సిన అవసరం లేని అప్పులు 1,54,876కోట్లు అని గుర్తు చేశారు. సీఎం చెప్పిన రూ.6,71,757 కోట్ల అప్పుల నుంచి గవర్నమెంట్ కట్టాల్సిన అవసరం లేని రూ.1,54,876 కోట్లను తీసేస్తే మిగిలిన అప్పు రూ.5,16,881 కోట్లు మాత్రమేనన్నారు. ప్రభుత్వం శ్వేతపత్రంలో రాష్ట్రం ఏర్పడే నాటికి రూ.72,658 కోట్ల అప్పు తెలంగాణకు గత ప్రభుత్వాల నుంచి సంక్రమించింది అని చెప్పారని.. రూ.5,16,881 కోట్ల ప్రభుత్వం కట్టాల్సిన అప్పు నుంచి వారసత్వంగా వచ్చిన రూ.72,658 కోట్ల అప్పును తీసివేస్తే రూ.4,44,223 కోట్ల అప్పు ఉంటుందన్నారు. తెలంగాణ ఏర్పడక ముందు ఎస్పీవీ (స్పెషల్ పర్పస్ వెహికిల్స్)ల ద్వారా గత ప్రభుత్వాలు చేసిన అప్పు రూ.11,609కోట్లు అని తెలిపారు. ఈ మొత్తాన్ని కూడా రూ.4,44,223 కోట్ల నుంచి తీసివేస్తే.. రూ.4,32,614 కోట్లు మిగులుతుందన్నారు. శ్వేతపత్రంలో ఎఫ్ఆర్బీఎం అప్పులు మార్చి 31, 2024 వరకు ఉన్న బడ్జెట్ ఎస్టిమేట్స్ను తీసుకున్నారని.. శ్వేతపత్రం డిసెంబర్లోనే విడుదల చేశారనేది మనందరికీ తెలిసిందేనన్నారు.

### పదేపదే తప్పుడు ప్రచారం..

శ్వేతపత్రంలో తెలివిగా కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న రూ.6,115 కోట్ల అప్పును బీఆర్ఎస్ ప్రభుత్వంలో జమ చేశారని.. కాంగ్రెస్ తీసుకున్న రూ.6,115 కోట్లను.. రూ.4,32,614 నుంచి తీసివేస్తే రూ.4,26,499 కోట్ల అప్పు మిగులుతుందన్నారు. అంటే తొమ్మిదిన్నరేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పు రూ.4,26,499 కోట్లు మాత్రమేనన్నారు. కానీ, పదే పదే రూ.6,71,757 కోట్లు అని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ రూ.4.26 లక్షల కోట్లలో ఉదయం స్కీం రూ.9వేల కోట్లు, 2019–20 15వ ఫైనాన్స్ కమిషన్ గ్రాంట్లను కేంద్ర ప్రభుత్వం చెల్లించకుండా రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పు రూపంగా రూ.2,459కోట్ల అప్పు తీసుకోవాల్సి వచ్చిందన్నారు. దీంతో పాటు కొవిడ్ సందర్భంలో గ్రాంట్ల రూపంలో రాష్ట్రాలను ఆదుకోకుండా, అప్పులు తీసుకునే స్థితికి కేంద్రం నెట్టిందని.. అందువల్ల రూ.17,558 కోట్ల అప్పు చేయాల్సిన అనివార్య పరిస్థితి తెలంగాణకు వచ్చిందని తెలిపారు. అదే విధంగా కోవిడ్ కారణంగా 2021–22 సంవత్సరంలో జీఎస్డీపీలో ఒకశాతం అధికంగా అప్పు చేయాల్సి వచ్చిందని చెప్పారు. ఆ మొత్తం రూ.10,784 కోట్లు అని.. తెలంగాణ రాష్ట్రం అనివార్యంగా రూ.41,159 కోట్ల అప్పు తీసుకోవాల్సిన పరిస్థితికి కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలు, కొవిడ్తో నెట్టబడిందన్నారు. ఇది ఏ ప్రభుత్వమున్నా అనివార్యంగా చేయాల్సిన అప్పు అని హరీశ్రావు వివరించారు.

# రాష్ట్ర ఎన్నికల కమిషనర్ గా కుమిదిని

- విశ్రాంత ఐఏఎస్ ఎంజీ గోపాల్ కు విజిలెన్స్ కమిషనర్ బాధ్యతలు..
- ఉత్తర్వులు జారీ చేసిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



**జనపదం, హైదరాబాద్ :** ఇద్దరు విశ్రాంత ఐఏఎస్ లకు బాధ్యతలు పోస్టులు వరించాయి. 1988 బ్యాచ్ కు చెందిన రాణి కుమిదిని రాష్ట్ర ఎకల కమిషనర్ గా నియమించిన సర్కార్.. ఎంపీ గోపాల్ కు రాష్ట్ర విజిలెన్స్ కమిషనర్ గా బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు రాష్ట్ర గవర్నర్ జిష్టుదేవ్ వర్మ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. రాణి కుమిదిని మూడేళ్ల పాటు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ గా కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆమె కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో వివిధ హోదాల్లో బాధ్యతలు నిర్వర్తించారు. కేంద్ర సర్వీసుల అనంతరం తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా విధులు చేపట్టారు. 2023 ఎన్నికలకు ముందు పదవీ విరమణ చేశారు.అప్పటి కేసీఆర్ ప్రభుత్వం తిరిగి అదే హోదాలో కొనసాగించింది. అయితే తాజాగా రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆమెను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ గా నియమించింది. అయితే మరికొద్ది రోజుల్లో స్థానిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో నూతన ఎస్ఈసీ నియామకం ప్రాధాన్యం సంతరించుకుంది.ఇప్పటి వరకు ఎస్ఈసీగా ఉన్న పార్థసారధి పదవీ కాలం ఈ నెల ఎనిమిదో తేదీతో ముగియడంతో కుమిదిని నియమితులయ్యారు. అలాగే.. మరో విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎంజీ గోపాల్ రాష్ట్ర విజిలెన్స్ కమిషనర్ గా నియమితులయ్యారు.1983 బ్యాచ్ కు చెందిన ఎంజీ గోపాల్ ఉమ్మడి రాష్ట్రంలో, తెలంగాణ రాష్ట్రంలో వివిధ హోదాల్లో బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం ఆయనను రాష్ట్ర విజిలెన్స్ కమిషనర్గా మూడేళ్ల పాటు నియమిస్తూ గవర్నర్ ఉత్తర్వులు జారీ చేశారు.



# యాగీ తుపాను బీభత్సం..

- 226 మంది మృతి.. మరో 77 మంది గల్లంతు
- మయన్మార్ అతలాకుతలం

**జనపదం, బ్యూరో :** భారీ వర్షాలతో మయన్మార్ అతలాకుతలమైంది. యాగీ తుపాను విరుచుకుపడటంతో వరదలు పోటెత్తాయి. పెద్దఎత్తున కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనల్లో దాదాపు 226 మంది మృతి చెందారు. మరో 77 మంది గల్లంతైనట్లు అధికారిక మీడియా వెల్లడించింది. లక్షలాది మంది ప్రజలు తమ ఇళ్లను వదిలి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. దాదాపు 6.30 లక్షలమంది ప్రకృతి విపత్తుతో ప్రభావితమయ్యారని, మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ఐరాస తెలిపింది. మయన్మార్ ఇటీవలి సంవత్సరాల్లో అత్యంత దారుణమైన వరదలు ఇవేనని పేర్కొంది. ఇప్పటికే అంతర్యుద్ధంతో సతమతమవుతున్న మయన్మార్ లో వరదల ధాటికి, వేల ఎకరాల్లో పంట నాశనమైంది. రాజధాని నేపిడావ్ ప్రాంతం తీవ్రంగా ప్రభావితమైంది. దాదాపు ఐదు లక్షల మంది ప్రజలు ఆహారం, తాగునీరు, సరైన ఆశ్రయం లేక అల్లాడుతున్నట్లు ఐరాస తెలిపింది. రహదారులు వంటి మౌలిక సౌకర్యాలు దెబ్బతినడంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోందని పేర్కొంది. ఈ క్రమంలోనే తమ దేశాన్ని ఆదుకోవాలని అక్కడి సైనిక పాలక వర్గం జుంటా విదేశీ సాయాన్ని అభ్యర్థించినట్లు తెలుస్తోంది. వియత్నాం, థాయ్‌లాండ్, లావోస్‌లలోనూ యాగీ తుపాను విధ్వంసం సృష్టించింది. ఒక్క వియత్నాం లోనే 300 మందిని బలితీసుకుంది.



# టార్గెట్ 'గ్రేటర్'..

- రానున్న ఎన్నికల్లో పట్టుకోసం ప్రయత్నాలు
- ప్రముఖులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీజేపీ
- కమలం గూటికి గౌతమి గ్రూప్ సంస్థల సీఎండీ, చైర్మన్ దంపతులు
- ఆహ్వానించిన కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్

**జనపదం, హైదరాబాద్ :** తెలంగాణ కోటపై కాషాయ జెండా ఎగరేయడమే లక్ష్యంగా పెట్టుకున్న భారతీయ జనతా పార్టీ రానున్న గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో విజయం పై పట్టు బిగించే ప్రయత్నం చేస్తోంది. పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేయడమే లక్ష్యంగా అడుగులు వేస్తోంది. ప్రజల్లో మంచి పేరున్న వారు., రాజకీయాలకు దూరంగా ఉంటున్న తటస్థులు., వ్యాపార, పారిశ్రామిక వేత్తలను పార్టీలోకి ఆహ్వానించి, క్షేత్ర స్థాయిలో పార్టీని బలోపేతం చేస్తోంది. ఈ క్రమంలోనే హైదరాబాద్ కేంద్రంగా రియల్ ఎస్టేట్ రంగంలో రాణిస్తూ మంచి పేరున్న గౌతమి గ్రూప్ సంస్థల సీఎండీ, చైర్మన్ దంపతులు గౌతమి, కళింగ సనపాల యోగేష్ కుమార్ తదితరులను బీజేపీలో చేర్చుకున్నారు. హైదరాబాద్ నాంపల్లి లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి, హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, రాజ్యసభ సభ్యుడు కె. లక్ష్మణ్, బీజేపీ రాష్ట్ర నాయకుడు సురేందర్ రెడ్డి తదితరులు గౌతమి, యోగేష్ కుమార్ కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వ్యాపార రంగంలో రాణిస్తూనే ఖాళీ సమయాల్లో పేదలకు, పార్టీకి సేవ చేయాలని కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఎంపీ లక్ష్మణ్ సూచించారు. కార్యక్రమంలో స్థానిక నేతలు హనుమంత రావు చౌదరి తదితరులు పాల్గొన్నారు

# జమిలి ఎన్నికలు..

## ప్రస్తుత ఎన్డీయే సర్కారు హయాంలోనే..



- మణిపూర్‌లో శాంతి స్థాపనకు కృషి..
- రైలు ప్రమాదాలపై దర్యాప్తు జరిపిస్తాం..
- కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా వెల్లడి

**జనపదం, ఢిల్లీ :** బీజేపీ సారథ్యంలోని ఎన్‌డీఏ ప్రస్తుత ప్రభుత్వ హయాంలోనే జమిలి ఎన్నికల విధానం అమలవుతుందని కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా తెలిపారు. మూడో సారి ప్రధాని నరేంద్ర మోదీ 100 రోజుల పాలన పూర్తయిన సందర్భంగా మంగళవారం ఢిల్లీలో కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తో కలిసి అమిత్ షా విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుత ఎన్ డీఏ ప్రభుత్వ హయాంలోనే 'ఒకే దేశం, ఒకే ఎన్నికలు' విధానం అమలు చేయాలనుకుంటున్నామన్నారు. తరచూ ఎన్నికల నిర్వహణ వల్ల దేశ పురోగతికి అవరోధాలు ఎదురవుతున్నాయని ఈ నేపథ్యంలో నెల క్రితం స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాని మోదీ జమిలి ఎన్నికల ఆవశ్యకతను నొక్కిచెప్పారని గుర్తు చేశారు. కాగా, దేశంలో జన గణన నిర్వహణపై ప్రభుత్వం అతి త్వరలోనే ప్రకటన చేస్తుందని తెలపారు. ఈ దశాబ్దపు జన గణన తొలి దశను 2020 ఏప్రిల్ 1న ప్రారంభించాల్సి ఉందని, అయితే కొవిడ్-19 మహమ్మారి కారణంగా దానిని వాయిదా వేయాల్సి వచ్చిందన్నారు. తాజా డాటా లేని కారణంగా ప్రభుత్వ సంస్థలు 2011 సెన్సస్ డాటా ప్రాతిపదికపై విధానాల రూపకల్పనకు, సబ్సిడీల కేటాయింపునకు ఇప్పటికీ పూనుకుంటున్నాయి.

### మణిపూర్‌లో శాంతి స్థాపనకు కృషి..

మణిపూర్‌లో చిరకాల శాంతి నెలకొనేలా చూసేందుకు ప్రభుత్వం మైతై, కుకీ తెగలు రెండింటితో మాట్లాడుతోందని, చొరబాటును నియంత్రించేందుకు మయన్మార్‌తో సరిహద్దులో కంచె వేయడం ప్రారంభించినట్లు అమిత్ షా తెలిపారు. క్రితం వారంలో మూడు రోజులు జరిగిన హింసాత్మక సంఘటనలు మినహా మణిపూర్‌లో పరిస్థితి మొత్తం ప్రశాంతంగా ఉందని, కల్లోలిత ఈశాన్య రాష్ట్రంలో ప్రశాంతత పునరుద్ధరణకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అవి జాతుల మధ్య దౌర్జన్య సంఘటనలు. రెండు తెగల మధ్య సంభాషణలు లేనిదే ఎలాంటి పరిష్కారం సాధ్యం కాదని, అందుకే శాంతి సాధనకు ఒక రోడ్‌మ్యాప్ రూపొందించామన్నారు. ప్రస్తుతం మణిపూర్ వ్యాప్తంగా వ్యూహాత్మక ప్రదేశాల్లో సీఆర్‌పీఎఫ్ సిబ్బందిని మోహరించామని తెలిపారు.

### రైలు ప్రమాదాలపై దర్యాప్తు జరిపిస్తాం..

వరుస రైలు ప్రమాదాల కుట్రలపై దర్యాప్తు జరిపిస్తామని, దేశవ్యాప్తంగా లక్షా పది వేల కిలో మీటర్ల రైల్వే నెట్‌వర్క్ పరిరక్షణకు ప్రభుత్వం త్వరలోనే ఒక పథకం ప్రవేశపెట్టనుందని మంత్రి చెప్పారు. రైల్వే భద్రత అంశంపై తాను గత రెండు రోజుల్లో రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో చర్చించినట్లు అమిత్ షా తెలిపారు. 'ప్రమాదాలకు సంబంధించినంత వరకు వాటికి మూల కారణంపై దర్యాప్తు జరిపిస్తామని, కారణం ఏదైనా ప్రభుత్వం సమస్య పరిష్కారానికి కట్టుబడి ఉన్నామన్నారు. ప్రమాదాల్లో చాలా వరకు విద్రోహ చర్యలుగా కనిపించాయని, రైలు పట్టాలపై బండరాళ్లు వంటి అవరోధాలు ఏర్పాటు చేశారని గుర్తించామన్నారు. అయితే అది కుట్ర అయినట్లయితే దీర్ఘ కాలం కొనసాగదని, లోపాలు ఉంటే సరిచేస్తామన్నారు. విద్రోహ చర్య ఏదీ లేకుండా చూసేందుకు రైల్వే నెట్‌వర్క్ పరిరక్షణకు సీబీఐ, ఎన్ఐఏ, రైల్వే పోలీస్ దళం, హోమ్ మంత్రిత్వశాఖ ఒక పథకాన్ని రూపొందిస్తున్నాయని అమిత్ షా తెలిపారు.

# ఎవరికి వారే.. ఎక్కడికక్కడే..!

- విమోచన దినోత్సవాన్ని నిర్వహించిన బీజేపీ
- ప్రజా పాలన పేరుతో కాంగ్రెస్ వేడుకలు
- జిల్లాల్లో జెండాలు ఆవిష్కరణ
- ప్రభుత్వ పథకాలను వివరించిన మంత్రులు, ఎమ్మెల్యేలు

**జనపదం, నెట్ వర్క్ :** సెప్టెంబర్ 17 వచ్చిందంటే చాలు.. ఎవరికి వారు.. ఎక్కడికక్కడే సొంత ఏజెండాతో కూడిన కార్యక్రమాలు కొనగుతుంటాయి. దీంతో రాష్ట్ర రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కడం ఏటా సర్వసాధారణంగా మారుతోంది. రాజకీయ పార్టీల మధ్య విమర్శలు, ప్రతి విమర్శలు తారా స్థాయికి చేరుతాయి. ప్రతి సంవత్సరం ఇదే రచ్చ., ఇవే రాజకీయాలు చోటుచేసుకుంటున్నాయి. అయితే సెప్టెంబర్ 17ను వివిధ పేర్లతో రాజకీయ పార్టీలు వేడుకలకు పిలుపునివ్వడమే ఇందుకు ప్రధాన కారణమవుతోంది. దీంతో ప్రజల్లో కూడా ఒక రకమైన కన్ఫ్యూజన్ నెలకొంటోంది. ఒకరు విలీనం అంటే., మరొకరు విమోచనం., ఇంకొకరు సమైక్యత దినం, విద్రోహ దినం అనే వారు కూడా లేకపోలేదు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కొత్తగా వచ్చిన కాంగ్రెస్ సర్కార్ కూడా ఈ రోజును సమైక్యత దినోత్సవం పేరిట ఘనంగా నిర్వహించింది. ఈ విషయంలో ఏ రాజకీయ పార్టీ వాదన ఆ పార్టీకి ఉంది.

### పార్టీల భిన్నాభిప్రాయాలు

తెలంగాణ ఉద్యమ సమయం నుంచి సెప్టెంబర్ 17 గురించి పెద్దఎత్తున చర్చ తెరమీదకు వచ్చింది. దీంతో 2014లో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు తరువాత ఈ రోజు విషయంపై తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ విషయంలోనే రాజకీయ పార్టీలలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఇందులో బీజేపీ విమోచన దినోత్సవం అంటోంది. ఈ క్రమంలోనే గత రెండేళ్లు కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో బీజేపీ 17వ తేదీని తెలంగాణ విమోచన దినోత్సవంగా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. కాగా బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో సెప్టెంబర్ 17వ తేదీని జాతీయ సమైక్యత దినంగా ప్రకటించింది. బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీలు జాతీయ సమైక్యత దినం అంటున్నాయి. కాగా టీడీపీ విలీన దినోత్సవంగా వేడుకలను నిర్వహించగా, సీపీఐ తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాన్ని ప్రతియేటా నిర్వహిస్తోంది. సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ వంటి పార్టీలు దీనిని విద్రోహ దినంగా పిలుస్తుంటారు. ఇక కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విలీన దినోత్సవంగా పేర్కొనగా., ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో ప్రజా పాలన దినోత్సవంగా నిర్వహించింది. మరో వైపు ఇదే రోజును విద్రోహ దినం అనే వారు కూడా ఉన్నారు. ఇలా సెప్టెంబర్ 17వ తేదీన వివిధ రకాల పేర్లతో నిర్వహిస్తూరాజకీయ పార్టీలు పరస్పర విమర్శలు, ప్రతి విమర్శలు, సవాళ్లు, ప్రతి సవాళ్లు కొనసాగుతుంటాయి.




### ఘనంగా జాతీయ జెండాల ఆవిష్కరణలు


17వ తేదీన ప్రజా పాలన దినోత్సవంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో రాష్ట్రంలోని 33 జిల్లాల్లో జాతీయ జెండాలను ఘనంగా మంత్రులు, ఎమ్మెల్యేలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొమ్మిది మాసాల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఈ సందర్భంగా ప్రజలకు వివరించారు.

# పటేల్‌కు బీజేపీతో సంబంధం లేదు..

- స్వాతంత్ర్య పోరాటం, హైదరాబాద్ విలీనంలో బీజేపీ పాత్ర లేదు
- అప్పటికి ఆ పార్టీ పుట్టనేలేదు..
- దేశాన్ని ముక్కలు చేయాలనే కమలం పార్టీ కుట్ర
- పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్
- గాంధీభవన్ ప్రజాపాలన వేడుకలు

**జనపదం, హైదరాబాద్ :** సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ తో బీజేపీ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో గానీ, హైదరాబాద్ విలీనంలో కానీ బీజేపీది ఎలాంటి పాత్ర లేదన్న ఆయన అప్పటికి ఆ పార్టీనే పుట్టలేదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి నీతులు చెప్పాల్సిన అవసరం లేదని విమర్శించారు. తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని గాంధీభవన్‌లో మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించిన పీసీసీ చీఫ్.. జాతీయ పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ దేశాన్ని ముక్కలు చేయాలని చూస్తుందని, అందుకే మతోన్మాదాన్ని రెచ్చగొడుతోందని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కీలకమైన సోనియా గాంధీని, వారి కుటుంబాన్ని కించపరచడం బీఆర్ఎస్ పార్టీ నీతిమాలిన చర్యలకు పరాకాష్ట అని దుయ్యబట్టారు. హైదరాబాద్ ప్రజాపాలనలో విలీనమైన సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన దినోత్సవం జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. స్వాతంత్ర్యానంతరం దేశ తొలి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ దేశంలోని అన్ని సంస్థానాలను విలీనం చేయాలని నాటి కేంద్ర హోంమంత్రి, ఆయనకు అత్యంత సన్నిహితులైన సర్దార్ వల్లభ్భాయ్ పటేల్‌ను కోరినట్లు తెలిపారు. సర్దార్ వల్లభ్భాయ్ పటేల్ స్వాతంత్ర్య సమరయోధుడు, నాటి ప్రధాని నెహ్రూకు అత్యంత సన్నిహితులని పేర్కొన్నారు.





# పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు..

- భూమిలేని పేదలకు ఏడాదికి రూ. 12 వేలు
- ప్రజాపాలన దినోత్సవాన్ని అంతా స్వాగతించాలి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- దళిత బంధు లబ్ధిదారులకు మంజూరి పత్రాల అందజేత

**జనపదం, ఖమ్మం :** అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని, ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీ అమలులో భాగంగా భూమి లేని నిరుపేద కుటుంబాలకు ఈ ఏడాది నేరుగా వారి ఖాతాల్లో రూ.12 వేలను జమ చేస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. మంగళవారం ఖమ్మం జిల్లా చింతకాని మండలం నాగులవంచ గ్రామంలో దళిత బంధు రెండో విడత లబ్ధిదారులు 847 కుటుంబాలకు రూ.15,54,32,620 మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. మధిర నియోజకవర్గం సిరిపురం గ్రామాన్ని సోలార్ వ్యవసాయ పంపు సెట్ల ఏర్పాటుకు పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. కార్యక్రమంలో ప్రజలను ఉద్దేశించి డిప్యూటీ సీఎం మాట్లాడారు. భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్య స్ఫూర్తితో ప్రజా ప్రభుత్వం చేసిన ప్రజాపాలన దినోత్సవాన్ని వ్యతిరేకించిన వారు రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని వ్యతిరేకించినట్టే అవుతుందన్నారు. సెప్టెంబర్ 17 దినోత్సవం విషయంలో భిన్నాభిప్రాయాలు ఉన్న పార్టీల నాయకులు ప్రజా ప్రభుత్వం ప్రకటించిన ప్రజాపాలన దినోత్సవాన్ని స్వాగతించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా త్వరలోనే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టబోతున్నామని చెప్పారు. ఇప్పటికే భద్రాచలంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పథకానికి శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు రూ.ఆరు లక్షలు, ఇతర లబ్ధిదారులకు రూ.ఐదు లక్షల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# విద్యపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి..

## గిరిజన పిల్లలకు నాణ్యమైన విద్యను అందిస్తాం..

- మంత్రి సీతక్క
- బంగారుపల్లిలో కంటైనర్ పాఠశాల ప్రారంభం
- హాజరైన ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, కలెక్టర్ దివాకర్ టీఎస్

**జనపదం, ములుగు :** దట్టమైన అటవీ ప్రాంత గిరిజన గ్రామాల పిల్లలకు నాణ్యమైన విద్యనందించడానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, గిరిజన పిల్లలను విద్యావంతులుగా చేయడానికి కృషి చేస్తున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. మంగళవారం మలుగు జిల్లా కన్నాయిగూడెం మండలం బంగారుపల్లిలో రూ.13 లక్షల 50 వేలతో ఏర్పాటు చేసిన కంటైనర్ ప్రభుత్వ పాఠశాలను మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, వరంగల్, నల్గొండ, ఖమ్మం నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ అటవీ ప్రాంతాల గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు చేయడానికి కేంద్ర అటవీశాఖ నిబంధనలు ఉన్నాయని, దీంతో ఆయా ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేయలేకపోతున్నామన్నారు. దీంతో ఎలాగైనా గిరిజన బిడ్డలకు విద్యను అందించాలని ఉద్దేశంతో కంటైనర్ పాఠశాలను ఏర్పాటు చేశామన్నారు. రానున్న రోజుల్లో మరో రెండు, మూడు చోట్ల ఇలాంటి పాఠశాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. గత పదేళ్ల పాలనలో విద్యా వ్యవస్థ నాశనం అయిందని, వందలాది ప్రభుత్వ పాఠశాలలు మూతపడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల హామీల మేరకు అన్ని సంక్షేమ పనులను అమలు చేస్తున్నామని, ఇచ్చిన హామీలను కాకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నూతన పథకాలు ప్రవేశ పెట్టి అర్హులైన లబ్ధిదారులకు అందజేయడానికి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. కార్యక్రమంలో ఓఎస్ డీ మహేష్ బాబా సాహెబ్ గీతే, ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, ఆర్డీవో కె.సత్యపాల్ రెడ్డి, పంచాయతీ రాజ్ ఈఈ రాజ్ అజయ్ కుమార్, డీఈవో పాణిని, మండల ప్రత్యేక అధికారి, తహసీల్దార్, ఎంపీడీవో, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



# వందేభారత్ కు జెండా ఊపబోయి..

## రైల్వే ట్రాక్‌పై పడిపోయిన బీజేపీ ఎమ్మెల్యే..

**జనపదం, బ్యూరో :** ఉత్తరప్రదేశ్‌లోని ఇటావాకు చెందిన బీజేపీ ఎమ్మెల్యే పెను ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. దేశంలో కొత్తగా మరో ఆరు వందే భారత్ రైళ్లను ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆగ్రా కంటోన్మెంట్ నుంచి బనారస్ వెళ్లే వందేభారత్ రైలుకు ఇటావా జంక్షన్‌లో పచ్చజెండా ఊపేందుకు స్థానిక ఎమ్మెల్యే సరితా భదోరియా హాజరై పచ్చజెండా ఊపబోయి ఫాట్‌ఫామ్ నుంచి పట్టాలపై పడిపోయారు. అయితే ప్రారంభోత్సవానికి పలువురు నాయకులు, అధికారులు, స్థానికులు పెద్ద సంఖ్యలో ప్లాట్‌ఫామ్‌పైకి చేరుకున్నారు. ఈ క్రమంలో ఫ్లాట్ ఫామ్ కిక్కిరిసిపోయిం ది. ఫ్లాట్ ఫామ్ చివర నిలుచున్న ఎమ్మె ల్యే ఆ తోపులాటలో ఆమె ప్రమాదవశాత్తు పట్టాలపై పడిపోయారు. అక్కడ ఉన్న పార్టీ కార్యకర్తలు, భద్రతా సిబ్బంది ఆమెను తక్షణమే ప ట్టాల మీద నుంచి లేపారు. తిరిగి ఫ్లాట్ ఫామ్ మీద నిలుచున్న ఎమ్మెల్యే సరిత తన చేతుల్లో ఉన్న పచ్చజెండాను ఊపారు.

# జియో సేవల్లో అంతరాయం..

- దేశవ్యాప్తంగా యూజర్ల ఆగ్రహం
- నెట్‌వర్క్ రావట్లేదంటూ సోషల్ మీడియాలో పోస్టులు

**జనపదం, ముంబై :** దేశంలోని అతిపెద్ద ప్రైవేట్ టెలికం రిలయన్స్ జియో సేవల్లో అంతరాయం ఏర్పడింది. మంగళవారం చాలా ప్రాంతాల్లో జియో నెట్‌వర్క్‌లో సమస్యలు తలెత్తాయి. దీంతో యూజర్లు నెట్‌వర్క్ రావట్లేదంటూ సోషల్ మీడియాలో వరుస పోస్టులు పెడుతున్నారు. ముఖ్యంగా ముంబైలో చాలా గంటల పాటు జియో సేవల్లో అంతరాయం ఏర్పడినట్లు వినియోగదారులు నివేదించారు. గంట వ్యవధిలోనే డౌన్ డెటెక్టర్ లో 10 వేల ఫిర్యాదులు వచ్చాయి. అందులో 67 శాతం మంది వినియోగదారులు సిగ్నల్ లేదని ఫిర్యాదు చేయగా.. 20 శాతం మంది మొబైల్ ఇంటర్నెట్ సమస్యలను ఎదుర్కొన్నారు. మరో 14 శాతం మంది జియో ఫైబర్‌లో సమస్యలను నివేదించారు. అయితే, ఐడీసీ డేటా సెంటర్ లో అగ్ని ప్రమాదం కారణంగా నెట్‌వర్క్ డౌన్ అయినట్లు పలువురు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. అయితే, ఈ సమస్యపై కంపెనీ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

# 20న మంత్రి మండలి సమావేశం..

**జనపదం, హైదరాబాద్:** రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఈనెల 20న రాష్ట్ర మంత్రిమండలి సమావేశం సచివాలయంలో జరగనుంది. ఈ సమావేశంలో వ్యవసాయ రుణమాఫీని సంపూర్ణంగా అమలు చేయడం, పంటల బీమా, రైతు భరోసా, హైడ్రాకు చట్టబద్ధత కల్పించే ఆర్డినెన్స్ జారీకి ఆమోదం తెలనుంది. దీంతో పాటు వివిధ అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు. చెరువుల పరిరక్షణకు ఏర్పాటు చేసిన హైడ్రా ఇప్పటివరకు 99 జీవో ద్వారా మాత్రమే కొనసాగుతోంది. ఎఫ్‌టీఎల్‌లో ఉన్న ఆక్రమణలను తొలగిస్తుంటే కొందరు అడ్డుకొని హైకోర్టును ఆశ్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో హైడ్రాకు చట్టబద్ధత కల్పించే ఆర్డినెన్స్ అంశంపై మంత్రిమండలి నిర్ణయం తీసుకోనుంది.

### రుణమాఫీపై నిర్ణయం

రాష్ట్రంలో రూ.2 లక్షల కంటే ఎక్కువ మొత్తంలో ఉన్న రుణాలు ఇంకా మాఫీ కాలేదు. దీంతో వారికి దశల వారీగా మాఫీ చేయడానికి ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకు కేబినెట్ ఆమోదం కావాలి. రైతుబంధు స్థానంలో రైతుభరోసాను పంట పెట్టుబడుల కోసం ప్రవేశపెట్టనుంది. దీనికి సంబంధించిన అమలు, పరిమితులపై జిల్లాల వారీగా అభిప్రాయాలు సేకరణ చేపట్టనుంది. ప్రస్తుతం వానాకాలం పంట ముగింపు దశకు చేరుతున్నందున వెంటనే పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వంపై ఒత్తిడి వస్తోంది. ఈ మేరకు పంటలు వేసిన వారికే సాయం చేస్తామని ఇప్పటికే వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల తెలిపారు. దీనిపై మంత్రిమండలి చర్చించి నిర్ణయం తీసుకోనుంది. కేంద్ర ప్రభుత్వ పంటల బీమా పథకాన్ని రాష్ట్రంలోనూ అమలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.

### కులగణనకు మార్గదర్శకాలు

రాష్ట్రంలో కులగణనను మూడు నెలల్లో పూర్తి చేయాలని హైకోర్టు ఆదేశించింది. స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఈ కులగణన చేపట్టాలని నిర్ణయించారు. ఈ మేరకు కులగణనకు సంబంధించిన సర్వే మార్గదర్శకాలు మంత్రిమండలి భేటీలో ఆమోదించనుంది. అలాగే ఇటీవల కురిసిన భారీ వర్షాలకుఇప్పటికే రూ.10 వేల కోట్లకు పైగా నష్టాన్ని ప్రాథమికంగా అంచనా వేశారు. ఈ మేరకు కేంద్ర బృందం వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించింది. నష్టాన్ని చూసింది. దీనిపై కేంద్రం విదారంగా సాయం చేయాలని మంత్రిమండలి తీర్మానం చేయనుంది.

### రేషన్‌కార్డులపై విధానాలు

పేద కుటుంబాలకు రేషన్ కార్డుల జారీలో పారదర్శకతను పెంచడానికి ఇప్పటివరకున్న అర్హతలను సవరించాలనే ప్రతిపాదనపై మంత్రిమండలి సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారు. రేషన్‌కార్డులతో సంబంధం లేకుండానే సాధారణ ప్రజలకు ఆరోగ్యశ్రీ సేవలను సులభంగా అందించడానికి ఆరోగ్య కార్డుల జారీకి ఆమోదం తెలపనున్నట్లు సమాచారం.

# బైబై గణేషా..

## ఘనంగా నిమజ్జనోత్సవం..

- కన్నులపండువగా శోభాయాత్ర
- కిక్కిరిసిన ట్యాంక్ బండ్, పరిసర ప్రాంతాలు
- క్రేన్ 4 దగ్గర ఖైరతాబాద్.. 13 దగ్గర బాలాపూర్ గణేశుడి నిమజ్జనం
- జీహెచ్ఎంసీ పరిధిలో 71 కృత్రిమ నీటి కొలనుల ఏర్పాటు
- వేలం పాటలో రికార్డులు బ్రేక్ చేసిన లడ్డులు
- కొనసాగుతోన్న నిమజ్జనాలు, పోలీసుల భారీ భద్రత
- బుధవారం ఉదయం వరకు నిమజ్జనం పూర్తి
- హుస్సేన్ సాగర్ వద్ద ఏర్పాట్లను పరిశీలించిన సీఎం రేవంత్

**జనపదం, హైదరాబాద్:**
గణనాథుడి చవితి వేడుకలు రాజధానిలో అంబరాన్నంటాయి. కాషాయ పగిడీలు, టోపీలు, కండువాలు ధరించి లక్షలాదిగా విచ్చేసిన భక్తుల నడుమ గణనాథుల ఊరేగింపు శోభయమానంగా సాగింది. అశేషంగా విచ్చేసిన భక్తులు బై బై గణేశా.. అంటూ గణపయ్యకు వీడ్కోలు పలికారు. దీంతో భాగ్యనగరమంతా కాషాయ మయమైంది. నగరంలో నవరాత్రులు పూజలందుకున్న విఘ్నేశ్వరుడి విగ్రహాల నిమజ్జన వేడుకలు మంగళ వారం ఉదయం ప్రారంభం కాగా నేటి ఉదయం వరకు కొనసాగుతాయని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సభ్యులు, నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. సప్తముఖ మాహాశక్తి గణపతిగా దర్శనమిచ్చిన ఖైరతాబాద్ లంబోదురుడు 11 రోజుల పూజల అనంతరం మంగళవారం రాత్రి నుంచి ప్రత్యేక పూజలు అందుకున్నాడు. బుధవారం ఉదయం ఆరు గంటలకే బయలుదేరిన 70 అడుగుల గణేష్ విగ్రహా నిమజ్జనం ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేసిన నాల్గో క్రేన్ వద్ద మధ్యాహ్నం 1.40 గంటల పూర్తయింది. మరో ప్రసిద్ధ బాలాపూర్ గణేశుడి నిమజ్జనం 13వ నెంబర్ క్రేన్ వద్ద సాయంత్రం 6 గంటల ప్రాంతంలో ముగిసింది. బడా గణేశుల నిమజ్జన పర్వం ముగియడంతో నగరంలోని సుమారు లక్షకు పైగా గణేష్ విగ్రహాలు నిమజ్జనం కానున్నాయి. నగరంతో పాటు శివారు ప్రాంతాల్లోని హుస్సేన్ సాగర్, సరూర్ నగర్, రాంపూర్, సఫిల్ గూడ, కాప్రా సహా వంద చెరువుల్లో వినాయక విగ్రహాల నిమజ్జనానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. వీటిలో ప్రధానంగా హుస్సేన్ సాగర్, సరూర్ నగర్ చెరువుల్లో ఎక్కువ సంఖ్యలో వినాయక విగ్రహాలు నిమజ్జనమవుతున్నాయి. మంగళవారం రాత్రి వరకు ట్యాంక్ బండ్ పై 40 వేలకు పైగా విగ్రహాలు గంగమ్మ ఒడిలో సేదతీరాయి. హుస్సేన్ సాగర్ చుట్టూ 32 భారీ క్రేన్లు అందుబాటులో ఉంచారు. విగ్రహాల ఊరేగింపులో ఇబ్బందులు కలగకుండా నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. రేపు రాత్రి వరకు నగరంలో లారీలకు అనుమతి ఇవ్వలేదు. మరోవైపు నిమజ్జన వేడుకలను తిలకించేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెడికల్ క్యాంపులు, డీఆర్డీఎఫ్ సిబ్బంది, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు.

**ఆధ్యాత్మికంగా శోభాయాత్ర..**
భాగ్యనగరం మొత్తం 'జై గణేశ్ మహారాజ్ కీ జై'నామ స్మరణ మార్మోగింది. బొజ్జ గణపయ్య నిమజ్జన వేడుకల్లో పాల్గొనేందుకు భక్తులు భారీగా తరలిరాగా బోలో గణేష్ మహరాజ్ కి జై అంటూ భక్తుల జయజయ ధ్వానాలు, కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాల మధ్య గణేశుడి విగ్రహాలు ముందుకు సాగాయి. శోభాయాత్రలో మహిళల నృత్యాలు ఆకట్టుకుంటున్నాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ఠ బందోబస్తును ఏర్పాటు చేశారు. అలాగే గణపతి శోభాయాత్రలో పాల్గొన్న భక్తులతో ఖైరతాబాద్ మెట్రో స్టేషన్ కు భారీగా ప్రయాణికుల రద్దీ పెరిగింది. దీంతో మెట్రో సిబ్బంది మెట్రో స్టేషన్ గేట్లను మూసివేశారు. పది నిమిషాలకు ఒకసారి ప్రయాణికులకు సిబ్బంది లోపలికి పంపిస్తున్నారు. మెట్ల వద్ద గేట్లు మూసివేయడంతో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



**గంగమ్మ ఒడికి మహాగణపతి..**
తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధి చెందిన ఖైరతాబాద్ మాహాశక్తి గణపతి నిమజ్జనం ఆద్యంతం భక్తజనుల సందడి మధ్య ఘనంగా ముగిసింది. 11 రోజుల పాటు భక్తుల నీరాజనాలు అందుకున్న భారీ గణేశుడు, గంగమ్మ ఒడికి చేరుకున్నాడు. 70 అడుగుల ఎత్తులో భారీకాయుడై, ప్రపంచ రికార్డు సృష్టించిన బొజ్జ గణపయ్య మధ్యాహ్నం 1.40 లకు హుస్సేన్ సాగర్ లో నిమజ్జనమయ్యాడు. ఆ క్రతువు చూసేందుకు భారీ సంఖ్యలో భక్తులు బారులు తీరారు. దీంతో నగర నడిబొడ్డు జనసంద్రంగా మారింది. 70 ఏళ్లుగా ఖైరతాబాద్‌లో వివిధ రూపాల్లో పూజలందుకున్న గణేశుడు, ఈసారి 70 అడుగుల మట్టి ప్రతిమతో ప్రపంచంలోనే ఎత్తయిన మట్టి గణపతిగా రికార్డుకు ఎక్కాడు. గణపతిని టస్కర్ పైకి చేర్చిన తర్వాత వెల్డింగ్ పనులకే దాదాపు 4 గంటల సమయం పట్టింది. అనంతరం శోభాయాత్ర బయలుదేరే ముందు ఖైరతాబాద్ గణపతికి మరోమారు పూజలు నిర్వహించారు. ఖైరతాబాద్, సెన్సేషన్ థియేట ర్, టెలిఫోన్ భవన్, తెలుగు తల్లి ఫ్లైఓవర్ పక్క నుంచి, సెక్రటేరియట్ మీదుగా సాగర తీరానికి ఖైరతాబాద్ గణనాథుడి శోభాయాత్ర వైభవంగా సాగింది. కనులారా వీక్షించేందుకు తరలిన భక్తజనంతో ట్యాంక్‌బండ్ పరిస ర ప్రాంతాల్లో భారీగా రద్దీ ఏర్పడింది. ముందెన్నడూ లేనంతగా అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.










**రికార్డు బ్రేక్ చేసిన లడ్డులు...**
బాలాపూర్ గణనాథుని లడ్డు కొన్నవారికి అది కొంగు బంగారం అవుతుందనే నమ్మకం ఉండడంతో, ఈ ఏడాది సైతం లడ్డు రికార్డు స్థాయి ధర పలికింది. స్థానికుడు కొలను శంకర్ రెడ్డి వేలం పాటలో రూ.30.01 లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు. లడ్డూ వేలం పాటను ప్రారంభించిన కొలను కుటుంబ సభ్యులు తొమ్మిదోసారి లడ్డూను కైవసం చేసుకోవడం విశేషం. ముగ్గురు స్థానికేతరులతో నువ్వా–నేనా అన్నట్లు పోటీ పడిన శంకర్ రెడ్డి, గతేడాది కంటే రూ.3 లక్షల ఒక వెయ్యి రూపాయలు అధికంగా వేలం పాడి బాలాపూర్ లడ్డూ విజేతగా నిలిచారు. కాగా 40 ఏళ్ల కిందట చవితి వేడుకల్లో లడ్డూ వేలం పాటను మొదలు పెట్టిన తమ కుటుంబానికి మరోసారి గణేశుడి ఆశీర్వాదం లభించడంపై కొలను శంకర్ రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. బాలాపూర్ లడ్డూను దేశ ప్రధాని మోదీకి అంకితం ఇస్తున్నట్లు శంకర్ రెడ్డి వెల్లడించారు. లడ్డూ వేలం పాటకు మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కాగా, మాజీ ఎమ్మెల్యే తీగల, మాజీ జడ్పీ ఛైర్మన్ అనితా హరినాథరెడ్డి, భాగ్యనగర ఉత్సవ సమితి సభ్యులు పాల్గొన్నారు.
హైదరాబాద్ లోని బండ్లగూడ జాగీర్ లంబోదరుడి చేతిలోని లడ్డూ రికార్డు ధర పలికింది. కీర్తి రిచ్మండ్ విల్లాస్ లో జరిగిన వేలంలో వినాయకుడి లడ్డూ ఏకంగా రూ.1.87 కోట్లు పలికింది. విల్లాలో ఉంటున్న 25 మంది కమ్యూనిటీ మొత్తం కలిసి ఆ లడ్డూను సొంతం చేసుకుంది.

**71 కృత్రిమ నీటి వనరుల్లోనూ నిమజ్జనం..**
వినాయక మండపాల నిర్వాహకులకు అనువుగా ఉండేలా గణేష్ విగ్రహాల నిమజ్జనానికి జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నగర వ్యాప్తంగా 71 కృత్రిమ నీటి కొలనులు ఏర్పాటు చేశారు. వీటిలో ఖైరతాబాద్ జోన్ పరిధిలో 13, శేరిలింగంపల్లి జోన్ లో 13, ఎల్బీనగర్, సికింద్రాబాద్ జోన్‌ల లో చెరో 12, కూకట్‌పల్లి జోన్‌లో 11, చార్మినార్ జోన్‌లో 10 కృత్రిమ నీటి కొలనులు ఏర్పాటు చేశారు. విగ్రహాలను నిమజ్జనం చేయడంతో పాటు వెంటనే వ్యర్థాలను తొలగించేలా అక్కడ సిబ్బందిని ఏర్పాటు చేశారు. ప్రతి విగ్రహాన్ని హుస్సేన్ సాగర్, సరూర్‌నగర్ చెరువులోనే కాకుండా ఆయా ప్రాంతాల్లో ఉన్న కృత్రిమ నీటి కొలనులో నిమజ్జనం చేయాలని అధికారులు సూచించారు. కృత్రిమ నీటి కొలనుల చుట్టూ పరిశుభ్రమైన వాతావారణం ఉండేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ట్యాంకుల ద్వారా నీటిని తీసుకొచ్చి నీటి కొలనులను నింపుతున్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసే విగ్రహాలను సహజ నీటి వనరుల్లో నిమజ్జనం చేసి నీటిని కలుషితం చేయొద్దని హైకోర్టు ఆదేశాలున్నాయి. దీంతో అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు.



# అంతు చూస్తా...





(**మొదటి పేజీ తరువాయి**) పాల్గొన్న సీఎం జాతీయజెండాను ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవవందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ అస్థిత్వం అంటే కుటుంబ పాలన కాదనీ స్వరాష్ట్రంలో బాధ్యతాయుత పాలన ఉండాలని అభిప్రాయపడ్డారు. తన ఢిల్లీ పర్యటనపై విపక్ష నేతలు చేస్తోన్న విమర్శలను ఆయన తప్పుబట్టారు. తన స్వార్థం కోసమో, వ్యక్తిగత పనుల కోసమో తాను ఢిల్లీ వెళ్లడం లేదన్న ఆయన తెలంగాణ హక్కుల సాధన కోసం ఎన్నిసార్లైనా ఢిల్లీ వెళ్తానని స్పష్టం చేశారు. ఢిల్లీ భారతదేశంలోనే ఉందనీ మరో దేశంలో లేదనే విషయాన్నితెలుసుకోవాలని చురకలంటించారు. ఇది ఫెడరల్ వ్యవస్థ అని రాష్ట్రాలకు, కేంద్రానికి మధ్య అనేక అంశాలుంటాయన్నారు. కేంద్రం నుంచి రావలసిన ప్రతి పైసా తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తూనే ఉంటానని వెల్లడించారు. ఇటీవల 16వ ఆర్థిక సంఘం ముందు కూడా తమ వాదనలు గట్టిగా వినిపించామన్న సీఎం కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు 50 శాతం వాటా ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేసినట్లు వివరించారు.

**ఫ్యూచర్ స్టేట్ గా..**
తెలంగాణనుప్రపంచ వేదికపై 'ఫ్యూచర్ స్టేట్' గా బ్రాండ్ చేస్తున్నామన్నారు. విదేశీ పెట్టుబడుల ఆకర్షణలో ఇది ఓ వ్యూహాత్మక ప్రయత్నమన్నారు. తాను ఫామ్‌హౌస్ సీఎంను కాదనీ పని చేసే ముఖ్యమంత్రిని అని వివరణ ఇచ్చారు. ఓ నియంత నుంచి తెలంగాణకు స్వేచ్ఛ కల్పిస్తామని ఆనాడు ప్రజలకు భరోసా ఇచ్చామన్న ఆయన పదేళ్ల పాటు విధ్వంసమైన తెలంగాణను మళ్లీ గాడిలో పెడతామని హామీ ఇచ్చారు.గత పాలకులు తెలంగాణ సంస్కృతిని, అస్థిత్వాన్ని తమ ఇంటి సంస్కృతి, కుటుంబ అస్థిత్వంగా భావించారని విమర్శించారు. వారి పాలనలో తెలంగాణ జాతి తమ దయా దాక్షిణ్యాలపై ఆధారపడి ఉందని భ్రమించారని బీఆర్ఎస్ పాలన తీరుపై మండిపడ్డారు. అధికారంలోకి రాగానే సాంస్కృతిక పునరుజ్జీవనానికి నాంది పలికానన్న సీఎం అందెశ్రీ రచించిన జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం గీతాన్ని మన రాష్ట్ర అధికారిక గీతంగా ప్రకటించానన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవనానికి శ్రీకారం చుట్టామన్నారు

**ఇకపై ప్రజా పాలన దినోత్సవం..**
అక్షరవీరులు ఒకవైపు, సాయుధ యోధులు మరో వైపు సాగించిన పోరాటంలో 76 ఏళ్ల క్రితం హైదరాబాద్ రాజ్యం స్వేచ్ఛ పొందిందని సీఎం రేవంత్ గుర్తు చేసుకున్నారు. ఒక ప్రాంతానికో.. ఒక కులానికో, ఒక మతానికో వ్యతిరేకంగా జరిగిన పోరాటం కాదన్న సీఎం.. సెప్టెంబర్ 17 ను కొంత మంది వివాదాస్పదం చేస్తున్నారన్నారు. అందుకే ఆ రోజున ప్రజాపాలన దినోత్సవం జరపాలని నిర్ణయించామన్న రేవంత్ రెడ్డి.. విలీనం, విమోచనం అంటూ స్వప్రయోజనాల కోసం రాజకీయం చేయడం సరికాదని విపక్షాలకు హితవు పలికారు. అందరూ కలిసి ఉంటారని చెప్పేందుకు సూచిక బిగిం చిన పిడికిలి అని అభివర్ణంచారు. పెత్తందా ర్లు, నియంతలపై పిడికిలి బిగించి పోరాటం చేశామని వెల్లడించారు. నియంత నుంచి తెలంగణకు స్వేచ్ఛ కల్పిస్తామని ఆనాడు భరోసా ఇచ్చామనీ ఆ మేరకు పాలన కొనసాగిస్తున్నామన్నారు. ఈ ఏడాది డిసెంబరు 9న రాష్ట్ర సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తామని సీఎం పునరుద్ఘాటించారు.

**లేక్ సిటీని ఫ్లడ్ సిటీగా మార్చారు...**
లేక్‌సిటీగా ఉన్న హైదరాబాద్ ఫ్లడ్ సిటీగా దిగజారడానికి గత పాలకుల నిర్లక్ష్యమే కారణమని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. కేరళ లాంటి దుస్థితి హైదరాబాద్‌కు రాకుండా చూసేందుకు హైడ్రా ఏర్పాటు చేశామని ప్రకటించారు. హైడ్రా జోలికి వచ్చిన వారి అంతుచూస్తానని సీఎం హెచ్చరించారు. హైడ్రా ఒక పవిత్ర కార్యమని,దీని ఏర్పాటు, కూల్చివేతల వెనక ఎలాంటి రాజకీయ ఉద్దేశాలు తమకు లేవని తేల్చిచెప్పారు. హైదరాబాద్ భవిష్యత్‌కు హైడ్రా గ్యారెంటీ ఇస్తుందని, ఇది తన భరోసా అన్నారు. అలాగే హైడ్రాను బెదిరిస్తున్న భూమాఫియాను వదిలిపెట్టబోమని హెచ్చరించిన సీఎం..
చెరువులు, కుంటల్లో నిర్మించిన భవనాల కూల్చివేతల విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదన్నారు. హైడ్రాపై ఎన్ని విమర్శలు వచ్చినా ముందుకే వెళ్తామన్నారు. ఈ సందర్భంగా హైడ్రా పనితీరుపై ప్రతిపక్ష నేతలు చేస్తున్న విమర్శలను సీఎం కొట్టిపారేశారు. రువుల ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్), బఫర్ జోన్ లలో కట్టిన బిల్డింగ్‌లు ఎంతపెద్ద వారివైనా కూల్చేస్తామన్నారు. ఈ విషయానికి సంబంధించి హైడ్రా ఇప్పటికే పలువురు ఆక్రమణదారులకు, బడాబాబులకు నోటీసులు ఇచ్చిందన్నారు. హైడ్రా పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేసిన సీఎం అధికారుల పనిలో తమ జోక్యం ఉండదని వివరించారు.







Printed and Published Mallika. On behalf of Sri Krishna Vande Jagadgurum Publications, Published at Banjara Hills Road , Erramazill 6-3-562-14, Hyderabad - Telangana 500082. Printing at Colour Graphics, 2-6-652/12, Amberpet Musarambagh Road ,Hyderabad, 500013 Telangana. Editor Sramik (Responsible for selection of News under the PRB act )
Reg no APTEL / 2012/46581, Phone Number 9849290606, Email ID : janapadham0606@gmail.com